

నకిలీ పింఛన్లకు 'చెక్'!

వైకల్యం లేకున్నా ఉన్నట్లుగా చూపి, సదరం క్యాంపుల్లో నకిలీ సర్టిఫికెట్లు తెచ్చుకుని దివ్యాంగుల పింఛను పొందుతున్న అక్రమార్కులకు ప్రభుత్వం చెక్ పెడుతోంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇబ్బడిముబ్బడిగా వైకల్యం ఉన్నట్లుగా సర్టిఫికెట్లు తీసుకుని పింఛను పొందుతున్న వారి వివరాలను సేకరించేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక వైద్య బృందాలను ఏర్పాటు చేసి సర్వే చేయించింది. ఈ ప్రత్యేక బృందాల సర్వేలో జిల్లాలో నాలుగు వేల మందికి పైగా వైకల్యం లేకున్నా దివ్యాంగుల పింఛను పొందుతున్నట్లుగా రుజువైంది. దీంతో ఆయా పింఛనుదారులకు ప్రభుత్వం ఇటీవల నోటీసులు జారీ చేసింది. నెలరోజుల్లోగా మీకున్న వైకల్యాన్ని నిరూపించుకోవాలని, అందుకు తగిన సర్టిఫికెట్లను సమర్పించేలా వెసులుబాటును కల్పించింది. నోటీసులు అందుకున్న వారిలో రెండు శాతం మంది వాస్తవంగా వైకల్యంతో ఇబ్బందులు పడేవారు ఉన్నట్లు సమాచారం.

జిల్లాలో 4 వేల మంది దివ్యాంగులకు నోటీసులు జారీ

నెలరోజుల్లోగా వైకల్యం నిరూపణకు అవకాశం

పొరపాటున పింఛను ఆపితే.. తర్వాత బకాయిలతో సహా చెల్లింపు

వాస్తవంగా వైకల్యంతో బాధపడుతూ ప్రత్యేక వైద్య బృందాలు ఇచ్చిన నివేదికలో పొరపాట్లు దొర్లి పింఛను ఆపివేస్తే, పూర్తిస్థాయిలో సర్టిఫికెట్లు సమర్పించిన అనంతరం పాతబకాయిలతో సహా పింఛను ఇచ్చేలా ప్రభుత్వం అవకాశం కల్పించిందని అధికారులు పేర్కొంటున్నారు. దివ్యాంగుల పింఛను పొందేందుకు అర్హత లేనివారి వయసు 60 సంవత్సరాలు దాటితే వారికి వృద్ధాప్య పింఛను ఇచ్చేలా వెసులుబాటును కల్పించారు. ఇలా జిల్లాలో 1400 మందికి దివ్యాంగుల పింఛను బదులుగా, వృద్ధాప్య పింఛను ఇస్తామని కూడా నోటీసులో పేర్కొన్నారు. ఉదాహరణకు మోపిదేవి మండలంలో 980 మంది దివ్యాంగుల పింఛను పొందుతున్నారు. ప్రత్యేక వైద్య బృందాల పరిశీలనలో 529 మంది దివ్యాంగుల పింఛను పొందేందుకు అర్హులని తేల్చారు. మిగిలిన వారిలో 118 మందికి 60 సంవత్సరాలు నిండడంతో వారికి దివ్యాంగుల పింఛనుకు బదులుగా వృద్ధాప్య పింఛను పొందేందుకు అర్హులని నివేదికను ఇచ్చారు. మరో 335 మందికి ఎటువంటి అర్హతలు లేవని నిర్ధారించారు. అయితే తమ పింఛను నిలిపివేస్తామని నోటీసులు ఇచ్చారని, తాము ఏం చేయాలని నోటీసులు అందుకున్న వారు సచివాలయాలకు, ఎంపీడీవో కార్యాలయ అధికారులకు ఫోన్ చేసి మరీ అడుగుతున్నారు. వీరిలో చెవుడు అని చూపి పింఛను పొందుతున్నవారే అధికంగా ఉన్నారని, ఫోన్‌లో తమతో మాట్లాడేటపుడు వారికి అన్ని మాటలు సక్రమంగానే వినపడుతున్నాయని అధికారులు, సచివాలయ సిబ్బంది ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

- 1400 మందికి వృద్ధాప్య పింఛనుగా మార్పు
- నోటీసులు అందుకున్న వారిలో చెవుడు ఉన్నట్టు సదరం సర్టిఫికెట్లు తెచ్చుకున్నవారే అధికం
- జిల్లా వ్యాప్తంగా పింఛనుదారుల సంఖ్య 2,36,400

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : జిల్లా వ్యాప్తంగా 2,36,400 మంది వివిధ రకాల పింఛన్లు పొందుతున్నారు. ఇందులో దివ్యాంగుల కోటాలో పింఛను పొందేవారు 36 వేల మంది వరకు ఉన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దివ్యాంగుల కోటాలో పింఛన్‌ను నెలకు రూ.6 వేలకు పెంచింది. దీంతో గతంలో సదరం క్యాంపుల్లో దళారుల ప్రమేయంతో వైకల్యం ఉన్నట్లుగా నకిలీ సర్టిఫికెట్లు తీసుకున్న వారు దివ్యాంగుల కోటాలో పింఛను తీసుంటున్నారు. ఈ అంశంపై పలు ఫిర్యాదులు అందడంతో మిగతా 6లో..



దళారుల వద్దకు పరుగులు

దివ్యాంగుల పింఛన్లు ఇప్పిస్తామని, ఆధార్ కార్డులలో వయసును పెంచి వృద్ధాప్య పింఛన్లు వచ్చేలా చేస్తామని గతంలో దళారులు పలువురి నుంచి నగదు వసూళ్లకు పాల్పడ్డారు. సదరం క్యాంపులలో వైకల్యం శాతం అధికంగా ఉన్నట్లుగా సర్టిఫికెట్లు జారీ చేయిస్తామని చెప్పి, సదరం క్యాంపులలో పనిచేసే వైద్యులతో కుమ్మక్కై, వైకల్యం లేకున్నా, అధికశాతం ఉన్నట్లుగా చూపి సదరం సర్టిఫికెట్లను మంజూరు చేయించారు. చెవుడు ఉన్నట్లుగా అధికశాతం సర్టిఫికెట్లను జారీ చేశారు. ఇందుకోసం దళారులు ఒక్కొక్కరి నుంచి రూ.25వేల నుంచి రూ.30వేల వరకు వసూలు చేసినట్టు తెలిసింది. గతంలో సదరం క్యాంపులు నిర్వహించిన సమయంలో దళారుల ద్వారా సర్టిఫికెట్లు పొందిన వారు ఇప్పుడు తమ పింఛను కొనసాగేలా చూడాలని వారి చుట్టూ తిరుగుతున్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు

ఓపెన్ బార్‌లకు నోటిఫికేషన్

ఎన్టీఆర్ జిల్లాలో 130, కృష్ణాజిల్లాలో 39 బార్‌లు

- 26 వరకు తుది గడువు
- మూడు శ్లాబ్‌లుగా ఫీజు విధానం
- బార్‌కు నాలుగు దరఖాస్తులు వస్తేనే డ్రా
- ఆరు వాయిదాలుగా ఫీజు చెల్లింపునకు అవకాశం

(ఆంధ్రజ్యోతి - విజయవాడ/మచిలీపట్నం): ఉమ్మడి కృష్ణా జిల్లాలో ఓపెన్ కేటగిరికి కేటాయించిన బార్‌లకు గెజిట్ నోటిఫికేషన్ విడుదలైంది. విజయవాడలోని మారుతీనగర్‌లో ఉన్న జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ మిగతా 6లో..

రేపు రిజర్వేషన్ కేటగిరి నోటిఫికేషన్

ఉమ్మడి కృష్ణాజిల్లాలో 14 బార్‌లను గీత కార్మికులకు రిజర్వ్ చేశారు. ఇందులో పది బార్‌లు ఎన్టీఆర్ జిల్లాలో, నాలుగు బార్‌లు కృష్ణాజిల్లాలో ఉన్నాయి. వాటికి బుధవారం నోటిఫికేషన్ విడుదల చేస్తామని డిప్యూటీ కమిషనర్ టి.శ్రీనివాసరావు తెలిపారు. గౌడ, గౌడ్ ఉపకులాలకు ఈ బార్‌లను రిజర్వ్ చేశారు. ఏ బార్‌ను ఏ ఉపకులానికి కేటాయించాలన్న దానిపై కలెక్టర్ లక్ష్మీశ సోమవారం లాటరీ తీశారు. విజయవాడలో ఒకటి, రెండు, మూడు, ఐదు, ఆరు, ఎనిమిది, తొమ్మిది నంబర్ల బార్‌లను గౌడ సామాజిక వర్గానికి కేటాయించారు. విజయవాడలో నాలుగు, ఏడు, కొండపల్లి మున్సిపాలిటీ(పర్యాటక కేంద్రం) బార్‌లను గౌడ్ సామాజిక వర్గానికి కేటాయించారు.

67 ఆగింది..!

ఇబ్బంది లేదంటున్న అధికారులు



ప్రకాశం బ్యారేజీ గేటుకు సాంకేతిక లోపం

- స్ట్రక్ అయిన 67వ నంబరు గేటు
- రోలర్‌లో సమస్య
- గేటును కదపని అధికారులు

(ఆంధ్రజ్యోతి - విజయవాడ): ప్రకాశం బ్యారేజీకి ఉన్న గేట్లు మొత్తం 70. ఇందులో 69 గేట్ల ద్వారా మాత్రమే ఎగువ నుంచి వస్తున్న వరద నీరు దిగువకు వెళ్తోంది. ఒక గేటును మాత్రం బ్యారేజీ అధికారులు ఆపరేషన్‌లోకి తీసుకోలేదు. ఆ గేటు వద్ద సాంకేతిక సమస్య ఏర్పడటమే దీనికి కారణం. బ్యారేజీ కార్యాలయం వైపున ఉండే 67వ నంబరు గేటులో కొద్దిరోజుల క్రితం సాంకేతిక సమస్య ఏర్పడింది. ప్రకాశం బ్యారేజీకి జూన్ ఒకటో తేదీ నుంచి వరద ప్రవాహం మొదలైంది. జూన్ నెలలో 14 రోజుల పాటు వరద వచ్చింది. తర్వాత వరద ప్రవాహం ఆగినప్పటికీ జూలై నెలలో 20వ తేదీ నుంచి మళ్లీ ఇన్‌ఫ్లో ఊపందుకుంది. అప్పటి నుంచి ఇప్పటి వరకు వరద ప్రవాహం కొనసాగుతూనే ఉంది. ఈ ఏడాదిలో ప్రకాశం బ్యారేజీకి మూడోసారి వరద వస్తోంది. మొత్తం 54 రోజులపాటు 233 టీఎంసీల నీరు ఎగువ నుంచి వచ్చింది. ఈ నీరంతా ప్రకాశం బ్యారేజీ గేట్ల గుండా సముద్రంలోకి వెళ్లింది.

నీటి ప్రవాహ పరిమాణం ఆధారంగా గేట్ల వినియోగం

బ్యారేజీ అధికారులు ఎగువ నుంచి వచ్చే వరద ప్రవాహం పరిమాణాన్ని బట్టి గేట్లను ఎత్తడం, దించడం చేస్తారు. వరద లక్ష క్యూసెక్కుల లోపు ఉంటే ఒకవిధంగా గేట్లను ఆపరేట్ చేస్తారు. అదే ప్రవాహం పెరిగే కొద్దీ గేట్లను ఒక్కో అడుగు పెంచుకుంటూ ఎత్తుతారు. ఈనెల ఒకటో తేదీ నుంచి వరద ప్రవాహం పెరుగుతుండడంతో అధికారులు 67వ నంబరు గేటును పైకి ఎత్తుతుండగా కొంత వరకు పైకి లేచి ఆగిపోయింది. అక్కడి నుంచి పైకి రాలేదు. దీనితో గేటు వద్ద ఏదో సాంకేతిక సమస్య వచ్చిందని అధికారులు గుర్తించారు. ప్రస్తుతం వరద వస్తున్నందున గేటుకు ఉండే గొలుసును వదులు చేసి మధ్యలో ఆగిపోయిన గేటును కిందికి దించేశారు. గేటుకు ఖానా గోడకు మధ్య ఇనుప పట్టీ మిగతా 6లో..



ఓవర్‌లోడ్.. రెట్టింపు ప్రయాణాలు

ఆర్టీసీ బస్సుల్లో రెట్టింపు సంఖ్యలో ప్రయాణాలు జరిగాయి. సిటీ బస్సులలో 50 శాతం ఆక్యుపెన్సీ సగటున ఉంటే.. సోమవారం ఒక్కరోజునే 100 శాతం దాటి పోవటం విశేషం. సిటీ బస్సులలో 100 మంది వరకు ప్రయాణించే పరిస్థితి ఏర్పడింది. ఒక బస్సులో 43 నుంచి 45 మందికి మాత్రమే అవకాశం ఉంటుంది. నిలబడి ప్రయాణించేవారు కూడా ఉంటారు. ఈ లెక్కన తీసుకుని ఓ 70 మంది ప్రయాణించటానికి అవకాశం ఉంటుంది. కానీ, ఆర్టీసీ సిటీ బస్సులలో ప్రధానంగా సబర్బన్ ప్రాంతాల నుంచి విజయవాడకు వచ్చే బస్సులలో 100 మందికి పైగా ప్రయాణికులతో బస్సులు నడిచాయి. హెవీ ఓవర్ లోడ్‌తో ఆర్టీసీ బస్సులు ప్రయాణించాయి.

మైలవరం బస్‌స్టేషన్‌లో మహిళల రద్దీ

ఫుల్‌జోష్!

ఆర్టీసీ బస్సుల్లో పోటెత్తిన మహిళలు

బస్టాప్‌లు, బస్‌స్టేషన్లు కిటకిట

- ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో విజయవంతంగా 'స్త్రీ శక్తి'
- ఆదివారం లక్షన్నర మంది మహిళల ప్రయాణం
- సోమవారం అంతకు ఐదారు రెట్లు ఎక్కువగా..
- 100 మందికిపైగా ప్రయాణికులతో నడిచిన సిటీ బస్సులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ / మైలవరం / ఇబ్రహీంపట్నం / చల్లపల్లి / తోట్లవల్లూరు / గూడూరు): ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణానికి సోమవారం మహిళలు పోటెత్తారు. ఉమ్మడి కృష్ణాజిల్లా వ్యాప్తంగా బస్టాప్‌లు, బస్‌స్టేషన్లు కిటకిటలాడాయి. రాష్ట్ర ప్రభుత్వం స్త్రీ శక్తి పథకం మిగతా 6లో..



గూడూరులో ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న మహిళలు

రికార్డు స్థాయిలో ప్రయాణాలు

ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఒక్క ఆదివారం రోజునజరిగిన మహిళా ప్రయాణికులే రికార్డు స్థాయిలో ఉన్నారు. సోమవారం వర్కింగ్ డే కావడంతో ఐదారు రెట్లు ఎక్కువగా మహిళలు ప్రయాణించి ఉంటారని అంచనా వేస్తున్నారు. సోమవారం నాటి గణాంకాలు మంగళవారం నాటికి కానీ రావు. ఆదివారం ఎన్టీఆర్ జిల్లా పరిధిలో లక్ష మంది మహిళలు ప్రయాణించారు. వీరిలో పెద్ద వాళ్లు 98,553 మంది ఉండగా.. పిల్లలు 1,903 మంది వరకు ఉన్నారు. కృష్ణాజిల్లా వ్యాప్తంగా 50 వేల మంది మహిళలు ప్రయాణాలు సాగించారు.



నిర్ణీత సమయంలో అర్జీలను పరిష్కరించాలి
● కలెక్టర్ బాలాజీ 6

గుడివాడ ఆక్వా ల్యాబ్‌కు అమెరికా బృందం 8

చరిత్ర చెప్పే సజీవ చిత్రాలు 6

మహో ప్రవాహం

పులిచింతలకు భారీగా పెరిగిన ఇన్‌ఫ్లో

- 4 లక్షల క్యూసెక్కులకు ఫోర్‌కాస్ట్
- బ్యారేజీకి తెల్లవారుజామున చేరే అవకాశం
- మహారాష్ట్రలో వర్షాల ప్రభావం

(ఆంధ్రజ్యోతి - విజయవాడ/మచిలీపట్నం): ఒక పక్క తెలంగాణ, మరోపక్క మహారాష్ట్ర ఈ రెండు రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాల ప్రభావంతో కృష్ణమ్మ నురగలు కక్కుతూ ఉరకలేస్తోంది. ఇప్పటి వరకు జిల్లాలోని పులిచింతల ప్రాజెక్టు, ప్రకాశం బ్యారేజీకి నిలకడగా సాగిన వరద ప్రవాహం సోమవారం రాత్రి ఒక్కసారిగా పెరిగింది. శ్రీశైలం ప్రాజెక్టు పది గేట్లను ఎత్తి దిగువకు నీటి విడుదల చేయడంతో నాగార్జున సాగర్ ద్వారా నీరు పులిచింతల ప్రాజెక్టుకు చేరుతోంది. సాయంత్రం ఆరు గంటలకు పులిచింతల ప్రాజెక్టు ఇన్‌ఫ్లో 2,47,951 క్యూసెక్కులు ఉండగా, దిగువకు 3,10,700 క్యూసెక్కుల నీటిని



విడుదల చేశారు. రాత్రి తొమ్మిది గంటలకు ఈ వరద ప్రవాహం పెరిగింది. ఎగువ నుంచి 2,92,192 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చింది. దిగువకు 3,66,008 క్యూసెక్కుల నీటిని వదిలారు. ఈ ఇన్‌ఫ్లో నాలుగు లక్షల క్యూసెక్కులకు పెరిగే అవకాశం ఉందని సెంట్రల్ వాటర్ కమిషన్ ఫోర్‌కాస్ట్ విడుదల చేసింది. దీంతో అటు పులిచింతల, దానికి దిగువన ఉన్న ప్రకాశం మిగతా 6లో..

చరిత్ర చెప్పే సజీవ చిత్రాలు









ఒక్క క్లిక్‌తో వెయ్యి పదాలకు భావాలను పలికించి.. ప్రతి ఒక్కరిని ఆలోచింపజేసే అపురూపమైన ఛాయా చిత్రాలు





తొలితరం బెలూన్ ఫోర్టబుల్ కెమెరాతో పొట్లూరి ప్రసాద్







(ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీ)

ఉరికే సెలయేరు, వేటాడే జంతువు, నిప్పులు గక్కే అగ్నిపర్వతం, ఎగసిపడే అలలు, చీకటిని చీల్చుతూ నేలను తాకే కిరణాలు, సంధ్యాకాలపు నీలాకాశ సుందర దృశ్యం, రెక్కలు చాచిన విహంగాలు, పుష్ప సోయగాలు, కదిలే కాలంలో వేగంగా పరిణామం చెందే జీవకోటి జీవన శైలిని ఒక్క క్షణం పాటు బంధించేది ఫోటో.. కార్మికుల కష్టాలు, అన్నదాతల అవస్థలు ప్రపంచానికి చాటిచెప్పేది ఫోటో.. వరదల్లో ఏటికి ఎదురీదేందుకు, విస్ఫోటన అగ్నిపర్వత అంచులను తాకేందుకు సాహసించేది ఫోటో.. అన్నార్తుల ఆర్తనాదాలు, కొండ కోనల్లోని బడుగుల బాధలను కళ్లకుకట్టేది, మొండి ప్రభుత్వాలను సైతం ప్రజా సంక్షేమం వైపు తిప్పగలిగే శక్తి ఒక్క ఫోటోకు మాత్రమే ఉందనడంలో ఏమాత్రం అతిశయోక్తి లేదు. వెయ్యి పదాల్లో చెప్పలేని భావాలను ఒక్క ఫోటోతో చెప్పవచ్చు. రాచరికపు రాజసాన్ని చూపిస్తుంది.. అదే రాజ్యంలో ఎండిన డొక్కలను కళ్లకు కడుతుంది. ఏటి పరుగుల్లో దాగున్న అందాలను చూపిస్తుంది.. ఏటి మునకకు బలైన బతుకులను బయటపెడుతుంది. తరతరాలు తరగని ఆస్తి అవుతుంది. చరిత్రకు సాక్ష్యంగా చిలిచి.. భవిష్యత్తుతరాలకు బంగారు బాట వేస్తోంది.

ఫోటో పరిణామ క్రమం ఇలా..

ఫోటోగ్రఫి(కాంతిని తీసుకోవడం)కి 1814 నుంచి కెమెరా సాయం అందించింది. అంతకు ముందు పిన్ హోల్ ద్వారా వ్యక్తుల, వ్యవస్థల దృశ్యాలను చిత్రీకరించేవారు. ఒక బాక్సునకు చిన్ని రంధ్రం చేసి దానినుంచి వచ్చే వెలుతురు సాయంతో నిర్దేశించుకున్న వ్యక్తి నీడను గీసి, ఆ తరువాత అందులో ముఖ, శరీర ఆకారం గీసేవారని చరిత్ర చెబుతోంది. 1814లో ఫ్రెంచ్ వాసి జూసిఫ్ కెమెరా రూపొందించాడు. అయితే అప్పట్లో ఆయన తీసిన ఫోటో ఎనిమిది గంటల్లోనే చెరిగిపోయింది. ఆ తరువాత 1837లో డాగ్యురి మొట్టమొదటి సారిగా ఫిక్స్‌డ్ ఇమేజ్‌ను రూపొందించి విజయం సాధించాడు. 1841లో విలియమ్స్ హెన్సికా నెగిటీవ్ కనుగొనడంతో అత్యధికంగా పోటోలు తీసే అవకాశం వచ్చింది. 1851లో ఎక్స్‌పోజీవ్ ఫిల్మ్, 1913 స్టిల్ కెమెరా అందుబాటులోకివచ్చి ఫోటోను కాస్త సులభతరం చేశాయి. 1935లో ట్రూమన్ కొడాక్ రోల్ ఫిల్మ్ కెమెరా ప్రవేశపెట్టాడు. 1941లో కొడాక్ కలర్ నెగిటీవ్ ఫిల్మ్, 1963లో పోలరైడ్ కలర్ ఫోటో వచ్చింది. 1978లో పాయింట్ షూట్ ఆటో ఫోకస్ కెమెరా వచ్చింది. 1985లో వచ్చిన డిజిటల్ కెమెరా చిత్రీకరణ వ్యవస్థనే మార్చేసింది. ప్రతి వస్తువు, ప్రతి ప్రాణి ఫోటోలు బంధించి, ప్రతి ఒక్కరికీ ఫోటో అందుబాటులోకి తీసుకొచ్చింది. 1990 తరువాత ఫోటో సీడీలు, డిజిటల్ ఇమేజ్ స్టోర్ డివైజ్‌లు అందుబాటులోకి వచ్చి యువతను ఫోటోగ్రఫి వైపు ఆకర్షితులను చేశాయి. నేడు ఎంతో మందికి జీవనోపాధిని అందుస్తున్నాయి. సోనీ, నికాన్, కెనాన్, ఒలంపస్ వంటి దిగ్గజ కంపెనీలు రోజుకో కొత్త ఆవిష్కరణలతో కెమెరా రూపాన్నే మార్చేస్తున్నాయి. ఎప్పటికప్పుడు అధునాతన ఫీచర్‌లున్న కెమెరాలను సమాజానికి పరిచయం చేస్తున్నాయి.

మొబైల్ ఫొటోగ్రఫీ ట్రెండ్

పైన చెప్పుకున్నవన్నీ ఒక ఎత్తు అయితే నేడు మొబైల్ ఫొటోగ్రఫీ విస్తృతమౌతోంది. చేతిలో సెల్ ఉన్న ప్రతి ఒక్కరూ తమ భావుకతకు అనుగుణంగా మంచి ఫొటోలను తీయటానికి అవకాశం చిక్కింది. సెల్‌ఫోన్ల ద్వారా కూడా సృజనాత్మకమైన ఫొటోలను తీస్తున్నారు. సెల్‌ఫోన్ ద్వారా తీసే ఫొటోలు కొన్ని మానవాళిని కదిలించేవిగా ఉంటున్నాయి. విస్తృతంగా వైరల్ అవుతున్నాయి.

విజయవాడలో కెమెరా కలెక్షన్

తొలితరం కెమెరాల నుంచి నేటితరం వాడుతున్న కెమెరాలన్నీ విజయవాడకు చెందిన పొట్లూరి ప్రసాద్ సేకరించారు. దుర్గమ్మ దేవస్థానంలో రికార్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఆయన ఫోటో, కెమెరాలపై ఆసక్తితో కెమెరా కలెక్షన్స్ చేశారు. ఒకప్పుడు నల్లని ముసుగేసుకుని ఫోటో తీసే బెలూన్ పోర్టబుల్ కెమెరా నుంచి నేటి అధునాతన లెన్స్ కెమెరాల వరకు 90 రకాలను ఆయన ఇప్పటి వరకు సేకరించారు. రష్యా, బ్రిటన్ గూఢచారులు వాడిన స్పై కెమెరాలు, నక్షత్రాలను పరిశీలించేందు శాస్త్రవేత్తలు వాడి ఆస్ట్రో ఫోటోగ్రఫి కెమెరాలు, టేప్ కెమెరాలు, పోలరైడ్ పోర్టబుల్ కెమెరాలు ఆయన సేకరించారు.

ప్రోత్సాహక బహుమతులు

ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎన్టీఆర్ జిల్లా అధికారులు నిర్వహించిన పోటీల్లో 'ఆంధ్రజ్యోతి' ఫోటోగ్రాఫర్‌లు తీసిన పలు ఫోటోలు ప్రోత్సాహక బహుమతులకు ఎంపికయ్యాయి. యోగాంధ్ర పోటీలకు సంబంధించి పి.రాజేష్, బెస్ట్ న్యూస్ పిక్చర్ విభాగంలో జీవీ నారాయణరావు, బి.సతీష్‌కుమార్, డి.లక్ష్మణ్ తీసిన ఛాయాచిత్రాలకుగాను మంగళవారం కలెక్టర్ లక్ష్మీశ నుంచి బహుమతులను అందుకోనున్నారు.



దుర్గగుడిలో అభివృద్ధి పనులను ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పర్యవేక్షిస్తున్న ఈవో శీనానాయక్

దుర్గగుడిలో ఏర్పాట్లపై ఈవో తనిఖీలు

ఇంద్రకీలాద్రి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రి దుర్గామల్లేశ్వర దేవస్థానంలో భక్తుల సౌకర్యాలపై ఈవో వీకే శీనానాయక్ ఇంజనీరింగ్ అధికారులు, పారిశుధ్య, భద్రతా సిబ్బందితో కలిసి సోమవారం క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించారు. భక్తులకు స్వచ్ఛమైన తాగునీరు, పారిశుద్ధ్యం, మరుగుదొడ్ల పరిశుభ్రతవంటి అంశాలపై పరిశీలించి తగు సూచనలు చేశారు. దుర్గగుడిలో అభివృద్ధి పనుల్లో భాగంగా జరుగుతున్న నిర్మాణాలను పరిశీలించారు. ముఖ్యంగా పారిశుద్ధ్యం, మురుగునీటి పారుదల వ్యవస్థలకు సంబంధించిన అంశాలపై ప్రత్యేక దృష్టి సారించారు.



సభలో మాట్లాడుతున్న సినినటుడు సుమన్

బడుగు వర్గాలకోసం పోరాడిన పాపన్నగౌడ్

» సినీనటుడు సుమన్

తిరువూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : బడుగు బలహీన వర్గాలు సంఘటితంగా ఉంటూ తోడ్పాటు అందించాలని, తమ పిల్లలను చదివిస్తే.. అదే మనం వారికి అందించే నిజమైన ఆస్తి అని సినినటుడు సుమాన్, ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావులు పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని బైపాస్ జంక్షన్ వద్ద స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని సుమన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ, పట్టణ ముఖద్వారం వద్ద పాపన్నగౌడ్ విగ్రహం ఆవిష్కరించడం తన అదృష్టం అన్నారు. తెలుగురాష్ట్రాల్లో బీసీ వర్గాలు ఎక్కువగా ఉన్నారని, వారికి సామాజికంగా, రాజకీయంగా, ప్రభుత్వ పరంగా న్యాయం జరగాలని కోరారు. తిరువూరులో కూలాలకు అతీతంగా పాపన్నగౌడ్ విగ్రహ ఏర్పాటు అభినందనీయం అన్నారు. బీసీల తరపున ఆయన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. హనుమంతు శ్రీనివాసరావు(సింధు శ్రీను)అధ్యక్షతన జరిగిన సభలో రాష్ట్రహజ్‌కమిటీ డైరెక్టర్ అబ్దుల్‌హుస్సేన్, కౌన్సిలర్ నాళ్లా సురేంద్ర, మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ వాసం మునియ్య, కౌన్సిలర్ నాళ్లా సురేంద్ర, గౌడసంఘం రాష్ట్ర నాయకులు ఈడ ఆశోక్‌కుమార్ గౌడ్, చలపతి వెంకటేశ్వరరావుగౌడ్, మరీదు శివ రామకృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రియల్ మనీ గేమ్ నుంచి ఈ-క్రీడలను వేరుచేసేందుకు చర్యలేవీ..?

» లోక్ సభలో ప్రస్తావించిన ఎంపీ కేశినేని చిన్ని

వన్‌టౌన్ : రియల్ మనీ గేమింగ్ నుంచి ఈ-క్రీడలను వేరు చేసేందుకు ఎటువంటి నిర్ణయం తీసుకుంటున్నారని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), మరో ఎంపీ బీకే పార్థసారథిలు లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడలశాఖ మంత్రి మాన్సుఖ్ మాండవీయా లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. ఈ-క్రీడలకు సంబంధించి ఇప్పటి వరకు ఎటువంటి సమాఖ్యను మంత్రిత్వ శాఖ గుర్తించలేదన్నారు. క్రీడలకు సంబంధించి ప్రత్యేక విభాగాల ప్రోత్సాహం, అభివృద్ధి, బాధ్యతలను జాతీయ క్రీడా సమాఖ్యలకే ఉంటుందని, రాబోయే బహుళ క్రీడా పోటీలలో ఈ-క్రీడల నియంత్రణ కోసం సంస్థాగతంగా ఎటువంటి నిర్ణయం చేయలేదని అన్నారు.ఈ-క్రీడలు, సాధారణ ఆటలకు వేరుగా ప్రత్యేక నియంత్రణ వ్యవస్థ ఏదీ లేదన్నారు. అయితే రియల్ మనీ గేమింగ్ నుంచి ఈ-క్రీడలను వేరు చేసేందుకు చర్యలు కొనసాగుతున్నాయన్నారు.

కొండపల్లి స్టేషన్‌లో పలు రైళ్లకు హాల్ట్ రద్దు

రైల్వేస్టేషన్: కొండపల్లి రైల్వేస్టేషన్ ఫుట్ ఓవర్ బ్రిడ్జికి మరమ్మతుల కారణంగా అక్టోబరు 18 నుంచి పలు రైళ్లకు కొండపల్లి స్టేషన్‌లో తాత్కాలికంగా హాల్ట్‌ను రద్దు చేసినట్టు దక్షిణ మధ్య రైల్వే పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ ఎ.శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 17406 అదిలాబాద్-తిరుపతి ఎక్స్‌ప్రెస్‌ను అక్టోబరు 18 నుంచి నవంబరు 17 వరకు కొండపల్లిలో నిలుపుదల చేయరు. 12749 మచిలీపట్నం-బీదర్, 12750 బీదర్-మచిలీపట్నం, 17201 గుంటూరు-సికింద్రాబాద్, 17202 సికింద్రాబాద్-గుంటూరు, 17405 తిరుపతి-అదిలాబాద్, 67215 విజయవాడ-భద్రాచలం, 67216 భద్రాచలం-విజయవాడ, 67768 విజయవాడ-డోర్నకల్ రైళ్లకు అక్టోబరు 19 నుంచి నవంబరు 18 వరకు కొండపల్లిలో హాల్ట్ ఉండదు.

నిర్ణీత సమయానికి అర్జీలు పరిష్కరించాలి

» రైతులకే సబ్సిడీ యూరియా

» కృష్ణా కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : సమస్యలకు పరిష్కారం కోరుతూ ప్రజలు సమర్పించిన అర్జీలను నిర్ణీత సమయానికి పరిష్కరించాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం ఆయన కలెక్టరేట్‌లో జేసీ గీతాంజలి శర్మ, సహాయ కలెక్టర్ ఫర్హీన్ జాహిద్, డీఆర్వో కె.చంద్రశేఖరరావు, బందరు ఆర్డీవో కె.స్వాతితో కలిసి ప్రజా సమస్యల పరిష్కారవేదిక మీకోసం కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల అర్జీలపట్ల నిర్లక్ష్యం వహించకుండా ప్రత్యేక శ్రద్ధ పెట్టి అర్జీదారులకు సకాలంలో పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ యూరియా కేవలం రైతులకు మాత్రమేనని, పౌల్ట్రీ, ఆక్వా పరిశ్రమలు తదితర వ్యవసాయేతర అవసరాలకు వినియోగించకూడదని హెచ్చరిస్తూ, దీని పర్యవేక్షణ కోసం వ్యవసాయ, మత్స్య, పశుసంవర్ధక, పరిశ్రమలు తదితర శాఖల అధికారులతో కమిటీని ఏర్పాటుచేసినట్టు కలెక్టర్ తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా యూరియాను వినియోగిస్తున్నట్టు గుర్తిస్తే చట్టపర చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇటీవల శిక్షణకు ఢిల్లీ వెళ్లిన కలెక్టర్ తన అనుభవాలను అధికారులతో పంచుకున్నారు. ముఖ్యంగా కృత్రిమ మేధస్సు(ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్) సాంకేతిక పరిజ్ఞానాన్ని రోజువారీ వృత్తిలో వినియోగించటం ద్వారా పనిసులభతరం చేసుకోవచ్చని, ఆ దిశగా ప్రయత్నం చేయాలని అధికారులకు సూచించారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

గీత కులాల మద్యం బార్‌ల కేటాయింపు

నూతన బార్ పాలసి 2025-28లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం గీత కులాలకు కేటాయించిన నాలుగు మద్యం బార్‌లకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారుల సమక్షంలో సోమవారం కలెక్టర్ బాలాజీ డ్రా ద్వారా షాపులను కేటాయించారు. మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్‌కు ఒకటి, గుడివాడ మున్సిపాలిటీకి ఒకటి, తాడిగడప మున్సిపాలిటీ రెండు కలిపి మొత్తం నాలుగు మద్యం బార్‌లను గీత కులాలకు ప్రభుత్వం కేటాయించగా, వాటిలో తాడిగడప-1, మిగిలిన మూడు ప్రాంతాలను గౌడ కులానికి డ్రా ద్వారా కేటాయించినట్టు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో కేఆర్సీ డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవి, జడ్పీ సీఈవో కన్నమనాయుడు, ఇన్‌చార్జి హౌసింగ్ పీడీ పోతురాజు, డీపీవో జె.అరుణ, డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్ట, ఆర్ అండ్‌బీ ఈఈ లోకేష్, సీపీవో భీమరాజు, డ్వాక్రా పీడీ ఎన్‌వి.శివప్రసాద్ యాదవ్, వ్యవసాయశాఖ అధికారి మనోహరరావు, ఉద్యాన అధికారిణి జ్యోతి, పౌరసరఫరాల అధికారి మోహనరావు, జిల్లా మేనేజర్ శివరాంప్రసాద్, ఐసీడీఎస్ పీడీ ఎంఎస్.రాణి, ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.



ఎస్పీ గంగాధరరావుకు సమస్యను వివరిస్తున్న ఫిర్యాదుదారు

సమస్యకు చట్టపరిధిలో పరిష్కారం

» జిల్లా ఎస్పీ గంగాధరరావు

మచిలీపట్నం క్రైమ్, అగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : సమస్య ఏదైనా చట్టప్రకారం పరిష్కరించడానికి జిల్లా పోలీస్ యంత్రాంగం సిద్ధంగా ఉందని ఎస్పీ ఆర్.గంగాధరరావు పేర్కొన్నారు. సోమవారం మీ కోసం కార్యక్రమంలో భాగంగా పలువురు తమ సమస్యలను ఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు. అవనిగడ్డ నుంచి సత్యనారాయణ తల్లి దండ్రుల ద్వారా సంక్రమించిన ఆస్తిని తన సోదరులు అక్రమంగా అనుభవిస్తున్నారని, అడిగితే చంపుతామని బెదిరిస్తున్నారన్నారు. దొంగ దస్తావేజు సృష్టించి ఆస్తిని కాజేయాలని చూస్తున్నారని, తనను రాకుండా అడ్డుకుంటున్నారని ఫిర్యాదు చేశారు. గుడ్లవల్లేరు మండలం వడ్డమన్నాడుకు చెందిన మహిళ తన భర్త వేరే మహిళతో అక్రమ సంబంధం ఏర్పరచుకుని చిత్రహింసలకు గురిచేస్తున్నాడని పలువురు బాధితులు తమ సమస్యలను ఎస్పీ గంగాధరరావుకు విన్నవించుకున్నారు.

పునరావృతం కాకుండా చూడాలి

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

విజయవాడ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రజల నుంచి స్వీకరించే అర్జీలు పునరావృతం కాకుండా చూడాలని, నిర్ణీత సమయంలో పరిష్కరించాలని కలెక్టర్ జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. ప్రజాసమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమంలో సోమవారం కలెక్టర్, జేసీ ఎస్.ఇలక్కియ అధికారులతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. రెవెన్యూ శాఖకు సంబంధించి 25, ఎంఏయూడీ 13, విద్య 10, పోలీస్ శాఖ 9, హెల్త్ 7, ఇరిగేషన్ 4, విభిన్న ప్రతిభావంతులు 3, డీఆర్‌డీఏ 3, ఇంటర్మీడియట్ విద్య 3, పంచాయతీరాజ్ 3, విద్యుత్ 2, పౌరసరఫరాలు 2, బ్యాంకు సేవల నుంచి 2 అర్జీలు వచ్చాయి. వ్యవసాయం, కళాశాల విద్య, ఎండోమెంట్ హౌసింగ్, మార్కెటింగ్, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్, ఆర్ అండ్ బీ శాఖలకు సంబంధించి ఒక్కో అర్జీతో కలిపి మొత్తం 93 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ, ప్రజా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల అమల్లో మంచి ఫలితాలు సాధించడంతో పాటు ప్రజా సమస్యలకు సంబంధించిన అర్జీలపై ప్రత్యేకంగా దృష్టిసారించి గడువులోగా పరిష్కరించడానికి బృందంగా పనిచేయాలని ఆదేశించారు. డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి, కేఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎ.పోసిబాబు, వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

రైతులకు హామీలేని రుణాలివ్వాలి

» కౌలురైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జమలయ్య

విజయవాడ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : ఆర్బీఐ నిబంధనల ప్రకారం హామీలేని పంటరుణాలు మంజూరు చేయాలని, బకాయిలతో సంబంధం లేకుండా కౌలురైతుకు పంటరుణాలు ఇవ్వాలని కౌలురైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య రాష్ట్రస్థాయి బ్యాంకర్స్ కమిటీని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం నగరంలో సోమవారం రాష్ట్ర లీడ్‌బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ దాస్యం శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జమలయ్య మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రతిగ్రామంలో 70 నుంచి 80శాతం భూమిలో పంటలు పండిస్తున్నది కౌలు రైతులేనన్నారు. కౌలు గుర్తింపు కార్డులు(సీసీఆర్‌సీ) పొందిన రైతులకు 2019లో వచ్చిన "ఆంధ్రప్రదేశ్ పంట సాగుదారు హక్కుల చట్టం" సెక్షన్ 5 ప్రకారం పంట హామీతో రుణాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. భూ యజమానికి బకాయిలు ఉంటే పంటరుణాలు ఇవ్వలేమంటూ బ్యాంకు మేనేజర్లు తిరస్కరిస్తున్నారని కమిటీ దృష్టికి తీసుకువెళ్లారు. ఇప్పటికైనా బ్యాంకులు రూపొందించుకున్న "స్టాండర్డ్ ఆఫ్ రేటింగ్ ప్రొసీజర్"లో ఉన్న నిబంధనలు సవరించి బకాయిలతో సంబంధం లేకుండా వ్యక్తిగత పూచీకత్తుతో రుణాలు ఇవ్వాలన్నారు. గుర్తింపు కార్డులు పొందిన వారికి రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా నిబంధన ప్రకారం స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ దృష్టిలో పెట్టుకుని రూ.2 లక్షల వరకు రుణాలు అందజేయాలని, కౌలురైతు సాగు చేస్తున్న భూమి దామాషాను బట్టి రూ.3 లక్షల వరకు పావలావడ్డీకి రుణాలు మంజూరు చేయాలని కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సున్నా వడ్డీ రాయితీ వర్తింపచేయాలన్నారు. సంఘం ఉపాధ్యక్షుడు మల్నీడి యల్లమందారావు మాట్లాడుతూ, గుర్తింపు కార్డులు రానివారికి జాయింట్ లయబులిటి గ్రూపులు ఏర్పాటు చేసి రుణాలు అందించాలన్నారు. అర్హత కలిగిన కౌలురైతుకు రుణాలు మంజూరుచేసి ఆదుకుంటామని లీడ్‌బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ శ్రీనివాస హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కృష్ణా జిల్లా కౌలురైతుల సంఘం ఉపాధ్యక్షుడు పెయ్యల వెంకటేశ్వరావు ఉన్నారు.

'ఓపెన్' బార్‌లకు నోటిఫికేషన్

(5వ పేజీ తరువాయి)

టి.శ్రీనివాసరావు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్.శ్రీనివాసరావు, మచిలీపట్నంలోని ఎక్సైజ్ కార్యాలయంలో సూపరింటెండెంట్ జి.గంగాధరరావు వేర్వేరుగా సోమవారం సాయంత్రం ఈ నోటిఫికేషన్ విడుదల చేశారు. ఎన్టీఆర్ జిల్లాలో 130, కృష్ణా జిల్లాలో 39 బార్‌లకు నోటిఫికేషన్ వెలువరించారు. అభ్యర్థులు 26వ తేదీ సాయంత్రం ఐదు గంటలలోపు ఆన్‌లైన్‌లో గానీ, ఆఫ్‌లైన్‌లో గానీ దరఖాస్తు చేసుకోవడానికి గడువు విధించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు హాల్ టికెట్‌ను ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో హాల్ టికెట్లు అందజేస్తారు. వాళ్లంతా దరఖాస్తులను ఇక్కడే అందజేయాల్సి ఉంటుంది. ప్రతి బార్‌కు నాలుగు దరఖాస్తులు వస్తేనే లాటరీ తీస్తారు. ఓపెన్ కేటగిరి బార్‌లకు 28వ తేదీన లాటరీ తీస్తారు. ఒక వ్యక్తి ఎన్ని బార్‌లకు అయినా దరఖాస్తులు చేసుకోవచ్చు.

జనాభా ఆధారంగా ఫీజులు

నగరాలు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో ఉన్న జనాభాను బట్టి ఫీజులను నిర్ణయించారు. 50వేల లోపు ఉన్న నగర పంచాయతీల్లో బార్‌కు రూ.35లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. 50వేలు నుంచి ఐదు లక్షల వరకు జనాభా ఉన్న మున్సిపాలిటీల్లో రూ.55 లక్షలు చెల్లించాలి. ఐదు లక్షలు పైబడిన నగరాల్లో బార్‌లకు రూ.75 లక్షలను ఫీజులుగా నిర్ణయించారు. లాటరీ ద్వారా బార్ దక్కించుకున్న తర్వాత ఆరు దఫాలుగా ఈ ఫీజును ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది. దరఖాస్తు సమయంలో డిపాజిట్‌గా రూ.5లక్షలు, దరఖాస్తు ఫీజుగా రూ.10వేలు చెల్లించాలి. బార్‌లు దక్కించుకున్న తర్వాత ప్రతి ఏడాది ఫీజు పది శాతం పెంచుతారు. ఇది కాకుండా డిపోల నుంచి కొనుగోలు చేసిన సరుకుపై రెట్ (రిటైల్ ఎక్సైజ్ టాక్స్) చెల్లించాల్సి ఉంటుంది. వైసీపీ ప్రభుత్వంలో దీన్ని ముందుగానే చెల్లించుకునే వారు. సరుకును విక్రయించిన రెండు నెలల తర్వాత రెట్‌ను చెల్లించే అవకాశం వ్యాపారులకు ప్రభుత్వం కల్పించింది. కొత్తగా ఏర్పాటు చేసుకోబోయే బార్‌లను ఉదయం పది గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు నిర్వహించుకోవడానికి అనుమతి ఇచ్చింది. వైసీపీ ప్రభుత్వం ప్రాంతాలను బట్టి దరఖాస్తులకు ఫీజులను నిర్ణయించింది. దీన్ని కూటమి ప్రభుత్వం రద్దు చేసింది. ఏకంగా ఒకటే ఫీజును నిర్ణయించింది.

నకిలీ పింఛన్లకు చెక్!

(5వ పేజీ తరువాయి)

కూటమి ప్రభుత్వం గత ఆరేడు నెలలుగా ప్రత్యేక వైద్య బృందాలను ఏర్పాటు చేసి, దివ్యాంగుల పింఛను పొందుతున్న వారి వివరాలు, వారు నిజంగా వైకల్యంతో ఇబ్బందులు పడుతున్నారా లేదా అనే అంశంపై నిజనిర్ధారణ చేయించింది. ప్రత్యేక వైద్య బృందాల పరిశీలనలో జిల్లాలో నాలుగు వేల మందికిపైగా వైకల్యం లేకున్నా ఉన్నట్లుగా సర్టిఫికెట్లు తీసుకుని దివ్యాంగుల పింఛను పొందుతున్నట్లుగా రుజువైంది. దీంతో వీరందరికీ మీకున్న వైకల్యానికి సంబంధించిన అన్ని పత్రాలను మళ్లీ చూపాలని నోటీసులు జారీ చేశారు. నోటీసులు అందుకున్న వారిలో చెవుడు ఉన్నట్లుగా చూపి దివ్యాంగుల పింఛను తీసుకుంటున్న వారే అధికంగా ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

ఫుల్‌జోష్!

(5వ పేజీ తరువాయి)

ప్రారంభించినప్పటి నుంచి సెలవు దినాలు కావటంతో పెద్దగా రద్దీ కనిపించలేదు. సోమవారం వర్కింగ్ డే కావటంతో మహిళలు బస్సుల్లో ప్రయాణించటానికి కదం తొక్కారు. ఎక్కడ చూసినా కూడా ఇదే రద్దీ కనిపించింది. పల్లెవెలుగు, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులు ఎక్కటానికి క్యూ కట్టారు. పీఎన్‌బీఎస్, సిటీ బస్‌పోర్టు, జగ్గయ్యపేట, తిరువూరు, గుడివాడ, అవనిగడ్డ, గన్నవరం, ఆటోనగర్, మచిలీపట్నం ప్రధాన బస్‌డిపోలలో రద్దీ అనూహ్యంగా ఉంది. ఇవి కాకుండా బస్‌స్టేషన్లుగా ఉన్న మైలవరం, కంకిపాడు, చల్లపల్లి తదితర బస్‌స్టేషన్లలో కూడా రద్దీ విపరీతంగా నెలకొంది. సోమవారం రోజున మహిళా ప్రయాణికులే మూడొంతుల మంది ఉన్నారు. ఆర్టీసీ బస్సులు రాగానే మహిళలు ఎక్కటానికి ఎగబడ్డారు. ఇలాంటి రద్దీ సంక్రాంతి పండగల సమయంలో మాత్రమే కనిపించేది. కానీ, సోమవారం సంక్రాంతిని తలపించింది.

మహా ప్రవాహం

(5వ పేజీ తరువాయి)

బ్యారేజీలను అధికారులు ఖాళీ చేస్తున్నారు. ఇన్‌ఫ్లోకు అనుగుణంగా నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. పులిచింతల ప్రాజెక్టుకు వచ్చే ఇన్‌ఫ్లో తెల్లవారుజామున ప్రకాశం బ్యారేజీని తాకే అవకాశాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. ప్రకాశం బ్యారేజీకి ప్రస్తుతం 2,70,277 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. బ్యారేజీ 69 గేట్లను పూర్తిస్థాయిలో ఎత్తి ఆ మొత్తం నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. తూర్పు, పశ్చిమ డెల్టా పరిధిలోని కాల్వలకు 3,333 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. పాలేరు నుంచి 5,967, కీసర నుంచి 25,716, వజినేపల్లి నుంచి 1,76,542 క్యూసెక్కుల నీరు వస్తోంది. మరోపక్క మున్నేరుకు 3,634 క్యూసెక్కుల నీరు వస్తోంది. 3,322 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

67 ఆగింది..!

(5వ పేజీ తరువాయి)

ఉంటుంది. అందులో గేటుకు రెండు వైపులా రోలర్లు ఉంటాయి. ఒక వైపున రోలర్ స్ట్రక్ అవ్వడంతో గేటు కదల్లేని పరిస్థితి వచ్చిందని అధికారులు తెలిపారు. ఈ సమస్యను సరి చేయడానికి అధికారులు రంగం సిద్ధం చేస్తున్న క్రమంలో ఒక్కసారిగా వరద పెరిగింది. వారం రోజుల క్రితం ఐదు లక్షల క్యూసెక్కుల వరద రావడంతో 67వ నంబరు గేటును కదపకుండా మిగిలిన 69 గేట్లను పైకి ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ఒక్క గేటు కిందికి దించి ఉంచడం వల్ల దిగువకు వెళ్లే నీటికి ఎలాంటి ఇబ్బంది లేదని బ్యారేజీ అధికారులు చెబుతున్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 505

ఎమ్మెల్యే యార్లగడ్డ ఆరోగ్యం కుదుటపడాలని పూజలు

హనుమాన్‌జంక్షన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): వైరల్ ఫీవర్‌తో బాధప డుతున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆరోగ్యం కుదుట పడి త్వరితగతిన కోలుకోవాలని కోరు తూ సోమవారం స్థానిక అభయాంజనేయస్వామి దేవస్థానంలో టీడీపీ నేతలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీడీపీ జంక్షన్ పట్టణ అధ్యక్షుడు అట్లూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పూజలు జరిపారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ గార్లపాటి రాజేశ్వరరావు, చెరుకూరి హరికృష్ణ, బోడిచర్ల స్వామి, చీలి ఆనంద్, పరసా కృష్ణబాబు, పొట్లూరి ఫణి తదితరులు పాల్గొన్నారు.



స్టేషన్ రోడ్డుకు మెరుపులు!

- అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద స్ట్రీట్ లైటింగ్ మంజూరు
- సుదీర్ఘ కాలంగా వెంటాడుతున్న సమస్యకు చెక్
- నూజివీడు ఫ్లైవోవర్ నుంచి రైల్వే స్టేషన్ ప్రధాన ద్వారం వరకు లైటింగ్ పోల్స్ ఏర్పాటు



నూజివీడు రైల్వేస్టేషన్ రహదారిపై వీధి లైట్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్న కార్మికులు

హనుమాన్‌జంక్షన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): సరైన వీధిలైట్లు లేక ప్రయాణికులు ఇబ్బందికి గురైన నూజివీడు రైల్వే స్టేషన్‌కు వెళ్లే ప్రధాన మార్గంలో వీధి లైట్లు వెలగబోతున్నాయి. నూజివీడు రోడ్డు నుంచి స్టేషన్‌కు వెళ్లే మార్గంలో వీధి లైట్లు లేక ప్రయాణికులు ఇబ్బందిపడ్డారు. గుడ్డి వెలుతురులో ప్రయాణికులు ఆ మార్గంలో రాక పోకలు సాగించే వారు. వీధి కుక్కల బెడదతో పాటు మద్యం, గంజాయి మత్తు బాబులు కూడా ఫ్లైవోవర్ కింద సంచరిస్తూ ఉండడంతో ప్రయాణికులు భయభ్రాంతులకు గురయ్యేవారు. ముఖ్యంగా మహిళలు ఒంటరిగా వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందికి గురయ్యారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద దేశంలో 1,275 స్టేషన్‌ల్లో మౌలిక సౌకర్యాలు, అభివృద్ధి పనులు చేపట్టారు. అందులో భాగంగా నూజివీడు రైల్వే స్టేషన్ ప్రధాన మార్గంలో 26 స్తంభాలు నిర్మించి వీధిలైట్లు ఏర్పాట్లు చేయడానికి నిధులు మంజూరు చేసినట్లు రైల్వేస్టేషన్ అధికారులు తెలిపారు. స్తంభాల నిర్మాణం దాదాపు పూర్తి అయ్యింది. మరో రెండు రోజుల్లో స్టేషన్ రోడ్డు వీధి లైట్లతో కొత్తకళ సంతరించుకోనుంది.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

ఉయ్యూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): విజయవాడ- మచిలీపట్నం జాతీయ రహదారిపై చినఓగిరాల సెంటర్ వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కాటూరుకు చెందిన కుందేటి సాంబశివరావు (65) మృతి చెందాడు. ఉయ్యూరు పట్టణ పోలీసుల వివరాల ప్రకారం.. కాటూరుకు చెందిన సాంబశివరావు తెలిసిన వ్యక్తి మోటర్‌సైకిల్‌పై వెనుక కూర్చుని ఉయ్యూరు నుంచి విజయవాడ వైపు వెళుతుండగా చిన ఓగిరాల వద్ద రోడ్డుదా టుతున్న మహిళను తప్పించే ప్రయత్నంలో మోటార్ సైకిల్ అదుపుతప్పి పడిపోయి సాంబశివరావు తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందగా మోటర్‌సైకిల్ నడుపుతున్న వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేశారు.

చురుగ్గా స్వామిత్వ సర్వే

హనుమాన్‌జంక్షన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నిర్వహిస్తున్న స్వామిత్వ సర్వే కార్యక్రమం ఈ నెలాఖరులోగా పూర్తి చేయడానికి కృషి చేస్తున్నట్లు బాపులపాడు ఈవోపీఆర్డీ కె.లక్ష్మయ్య సోమవారం ప్రకటనలో తెలిపారు. 27 గ్రామ పంచాయతీల్లో మొదటి విడత బిళ్లనపల్లి, కొయ్యూరు. కురిపిరాల, బండారు గూడెం గ్రామాలు పూర్తి చేసినట్లు తెలిపారు. మరో 20 గ్రామాల్లో. మొదటి దశ సర్వే నిర్వహిస్తున్నట్లు లక్ష్మయ్య పేర్కొన్నారు.



చెక్కులు అందజేస్తున్న టీడీపీ నాయకుడు చిరంజీవి

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత

ఉయ్యూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఉయ్యూరు 20వ వార్డుకు చెందిన నలుగురికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ. 3.50 లక్షలు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ద్వారా మంజూరు కాగా పార్టీ నాయకుడు చిరంజీవి లబ్ధిదారులకు సోమవారం చెక్కులు అందజేశారు.



మెడల్స్ సాధించిన విద్యార్థులు

కరాటేలో ఉయ్యూరు విద్యార్థులకు పతకాలు

ఉయ్యూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులో పర్వతరెడ్డి ఆనంద్ మినీ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన ఆల్ ఇండియా కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో నివాస్ కరాటే అండ్ మార్షల్‌ఆర్ట్స్ అకాడమి విద్యార్థులు కటా, కుమితే విభాగాలలో పాల్గొని 3 బంగారు,2 వెండి, 3 కాంస్య పతకాలు సాధించారు. ఎం.మోహిత్, ఎస్.జోషిక, ఎం.ఈశ్వరి బంగారు, ఎం.హరణి, కె.అక్షయ వెండిపతకాలు, జి.సాత్విక్, వై.రమ శ్రీదేవి, జె. సాయి శ్రీవల్లి కాంస్యపతకాలు సాధించినట్లు అకాడమి ప్రెసిడెంట్ డి.శ్రీనివాస్ తెలిపారు.



దాతలతో సర్పంచ్ చౌటపల్లి భారతి, ఎస్ఎంసీ చైర్మన్ కట్టా దుర్గ

ఎంపీపీ స్కూల్‌లో మౌలిక సౌకర్యాల కల్పన

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధికి మౌలికసదుపాయాలు కల్పిస్తున్న దాతల సహకారంతో చదువుల్లో రాణించాలని సర్పంచ్ చౌటపల్లి భారతి విద్యార్థులకు సూచించారు. రేమల్లె మండల పరిషత్ మోడల్ ప్రైమరీ స్కూల్‌కు దాతలు రూ. 30వేల విలువగల సదుపాయాలు ఏర్పాటు చేయడంతో పాటు జాతీయ నాయకుల చిత్రపటాలను సోమవారం హెచ్‌ఎం వెలమర్తి రవిబాబుకు అందజేశారు. భోజనశాలకు అవసరమైన గ్యాస్‌స్టౌవ్‌ను వడ్లమూడి వెంకటకృష్ణారావు వితరణ చేయగా సర్పంచ్ చౌటపల్లి భారతి 2టేబుల్స్, తొమ్మండ్రు మహాలక్ష్మయ్య 2ఫ్యాన్లు, వడ్లపట్ల సాంబశివరావు కుర్చీ, తిరివీధి మరియదాస్ టేబుల్‌తో పాటు డోర్, పెనుముచ్చు దేవదాస్ జాతీయ నాయకుల చిత్రపటాలను అందజేశారు. ఈ కార్యక్ర మంలో ఎస్ఎంసీ చైర్మన్ కట్టా దుర్గ, కలపాల రాధాకృష్ణమూర్తి, నిమ్మకూరి రంగారావు, మేడేపూడి రంగారావు, వెలగపూడి మధుసూదనరావు, ఉపాధ్యాయులు డీఎస్ఎన్ పద్మజ, కుమార్ పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను నెరవేరుస్తున్న ప్రభుత్వం

ఎమ్మెల్యే బోడె ప్రసాద్



నూతనంగా నిర్మించిన రహదారులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్, జనసేన నాయకులు

కంకిపాడు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం విజయవంతంగా అమలు చేస్తుందని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. మండలంలోని కోలవెన్ను గ్రామంలో రూ. 1.10 కోట్లతో నిర్మించిన రోడ్లను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసీపీ హయాంలో దోచుకోవడం, దాచుకోవడం మినహా చేసిందేముందని ప్రశ్నించారు. రాష్ట్ర వ్యాప్తంగా రివర్స్ టెండరింగ్ పేరుత రాష్ట్రాన్ని 25 ఏళ్లు వెనక్కి నెట్టేశారమని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో విజయవంతంగా సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. నియోజకవర్గంలో ఉపాధి హామీ నిదులు, పంచాయతీ నిధులు, రాష్ట్ర అభివృద్ధి నిధులు, మండల పరిషత్ నిధులు అంటూ సుమారు రూ. 76 కోట్లతో రహదారులు, డ్రైనేజీలు నిర్మించి ప్రారంభోత్సవాలు చేయడం జరిగిందన్నారు. మరో రూ. 56 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలియజేశారు. వివిధ శాఖల అధికారులతో మాట్లాడి రూ. 100 కోట్లతో అవసరమైన గ్రామాల్లో అభివృద్ధి పనులకు అంచనా ఏర్పాటు చేయాలని కోరడం జరిగిందని తెలియజేశారు. నియోజకవర్గంలో ప్రతిపక్ష పార్టీ హోదా కూడా లేని వైసీపీ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని కూటమి నాయకులు సమర్థవంతంగా తిప్పికొట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అనూష, స్థానిక టీడీపీ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ, సర్పంచ్ లాం సురేష్, ఉపసర్పంచ్ చిన్ని, టీడీపీ నాయకులు బొబ్బా శ్రీనివాసరావు, తుమ్మల జగదీష్, మునిబోయిన బాబు, జనసేన పార్టీ నాయకులు పులి కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పెనమలూరు: కొన్నేళ్లుగా గత టీడీపీ ప్రభుత్వంలో, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఆరోగ్యపరంగా ఇబ్బందులు పడుతున్న వందలాది మంది నియోజకవర్గ ప్రజలకు కోట్లాది రూపాయలు సీఎం సహాయనిధి సొమ్మును తన చేతుల మీదుగా అందించడం తన అదృష్టంగా భావిస్తున్నానని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. సోమవారం పోరంకి టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గంలోని ఉయ్యూరు టౌన్‌కు చెందిన 32 మంది వ్యక్తులకు 28.36లక్షల చెక్కులను పంపిణీ ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కూటమి నాయకులు అనుమోలు ప్రభాకరరావు, కొండా ప్రవీణ్, తోటకూర ఉదయభాస్కర్ పాల్గొన్నారు.



వెల్దిపాడు చైర్‌పర్సన్ రాజమన్నార్‌కు నియామకపత్రం అందజేస్తున్న టీడీపీ నాయకులు

రైతుల సంక్షేమానికి సొసైటీలు కృషి చేయాలి

ఉంగుటూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమానికి, పీఏసీఎస్ నూతన పాలకవర్గాలు కృషి చేయాలని టీడీపీ గన్నవరం నియోజకవర్గ నాయకుడు కాసన్నేని రాజా అన్నారు. వెల్దిపాడు కో-ఆపరేటివ్ సొసైటీ త్రిసభ్యకమిటీ ప్రమాణ స్వీకారోత్సవం సోమవారం కూటమి నాయకులు, రైతులు, స్థానిక ప్రజాప్రతినిధుల సమక్షంలో ఘనంగా జరిగింది. సొసైటీ చైర్‌పర్సన్‌గా నెక్కలపూడి వెంకట రాజమన్నార్, డైరెక్టర్లుగా కొట్నాని శ్రీనివాసరావు, పాటూరి శివరంగారావు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నూతన చైర్‌పర్సన్ రాజమన్నార్‌కు టీడీపీ మండల అధ్యక్షుడు కొలుసు రవీంద్రబాబుతో కలిసి రాజా నియామకపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉంగుటూరు కేడీసీసీబీ బ్రాంచ్ మేనేజర్ పటాన్ షబ్బీర్, టీడీపీ మండల అధ్యక్షుడు కొలుసు రవీంద్రబాబు, నాయకులు పోతినేని రామకృష్ణ, నెక్కలపూడి వెంకట అప్పారావు, కొట్నాని మోహన్‌రావు, వెంకయ్య, గొంగాడ సాంబశివరావు, బీజేపీ మండల అధ్యక్షుడు పాతూరి శివసీతారాములు, కొయ్యగూరపాడు పీఏసీఎస్ మాజీ చైర్మన్ రత్నప్రసాద్ (నాని), మాజీ ఏఎంసీ డైరెక్టర్ బొకినాల కిరణ్, సర్పంచ్‌లు కాటూరి వరప్రసాద్, షేక్ పెద్దనాగూర్, రైతులు పాల్గొన్నారు.

నెప్పల్లి పీఏసీఎస్ చైర్మన్‌గా చలసాని జోగేంద్రనాథ్

కంకిపాడు: మండలంలోని నెప్పల్లి, కోలవెన్ను పీఏసీఎస్ చైర్‌పర్సన్, సభ్యుల ప్రమాణ స్వీకారం సోమవారం ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఘనంగా నిర్వహించారు. నెప్పల్లి పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా చలసాని జోగేంద్రనాద్ (బోసు), డైరెక్టర్లుగా దేవిరెడ్డి వెంకటేశ్వరెడ్డి, కొత్తూరు వెంకటేశ్వరరావులతో మాజీ ఎంపీపీ దేవినేని రాజా ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అన్నే ధనయ్య, ఉప సర్పంచ్ నాని, ఎంపీటీసీ సభ్యురాలు కొలుసు రాజేశ్వరి, టీడీపీ నాయకులు గోవిందరావు, చలసాని వెంకటేశ్వరరావు, మండవ కిషోర్ బాబు, శివరామ్, చింతపల్లి కోటేశ్వరరావు కార్యదర్శి యామిని తదితరులు పాల్గొన్నారు.

● కోలవెన్ను పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా వల్లభనేని రాంబాబు, డైరెక్టర్లుగా కొణతం నాగమణి, లాం రమేష్‌లతో ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ, ఏఎంసీ చైర్మన్ కొండా ప్రవీణ్, కంకిపాడు ఏఎంసీ వైస్ చైర్మన్ కళ్యాణి, సర్పంచ్ లాం సురేష్, ఉప సర్పంచ్ చిన్ని, తుమ్మల జగదీష్, బొబ్బా శ్రీనివాసరావు, సెంగెపు రంగారావు పాల్గొన్నారు.



నెప్పల్లి చైర్‌పర్సన్ జోగేంద్రనాథ్‌తో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న దేవినేని రాజా

హోరా హోరీగా వాలీబాల్ పోటీలు


గన్నవరం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడాప్రాంగణంలో నియోజకవర్గస్థాయి వాలీబాల్ పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. నియోజకవర్గంలోని గన్నవరం, ఉంగుటూరు, బాపుల పాడు, విజయవాడ రూరల్ మండలాలకు చెందిన 25 జట్లు ఈ పోటీల్లో తలపడుతున్నాయి. తొలుత మూడవరోజు పోటీలను వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కేవీఆర్ కిషోర్ ప్రారంభించారు. గ్రామీణ వాలీబాల్ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు వాకర్స్ అసోసియేషన్, సీనియర్ వాలీబాల్ క్రీడాకారుల సంయుక్త ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 19న జరిగే ఫైనల్ మ్యాచ్‌తో ఈ పోటీలు ముగుస్తాయని తెలిపారు.



విద్యార్థులకు ఉపకారవేతనాలు అందజేస్తున్న లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు పంచకర్ల రమేష్ చక్రవర్తి

ఉత్తమ విద్యార్థులకు ఉపకార వేతనాలు

హనుమాన్‌జంక్షన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకుంటూ భవిష్యత్తును బంగారుమయం చేసుకోవాలని స్థానిక లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పంచకర్ల రమేశ్ చక్రవర్తి అన్నారు. బాపులపాడు మండలంలో పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు శ్రవంతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వీరమాచనేని సత్యప్రసాద్ ఉపకార వేతనాలు సోమవారం ట్రస్ట్ కార్యాలయంలో అందించారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రమేశ్ చక్రవర్తి, మానవత రాష్ట్ర అధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వరరావు, బానాల నరసింహారావు విద్యార్థులకు నగదు ప్రోత్సాహంతో పాటు ప్రశంసాపత్రాలు, పతకాలు అందించారు. ట్రస్ట్ గౌరవ అధ్యక్షు డు డీవీ.రమణ, వీరమాచనేని శ్రీదేవి, డాక్టర్ పోలవరపు కల్యాణ్ చక్రధర్, డాక్టర్ స్వరాజ్యం, ఎం ఈవో రాంబాలసింగ్, కొల్లి జగదీశ్వరరావు, అక్కినేని రాఘవేంద్ర రావు, వీరవల్లి, బాపులపాడు, కానుమోలు, రేమల్లె జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎంలు పి.నిర్మల, శ్రీనివాసరావు, లూధర్‌పాల్ పాల్గొన్నారు.



ఏజీ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్‌కు అవార్డు

ఉయ్యూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఏజీ అండ్ ఎస్‌జీఎస్ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్ బి.నాగఫణీంద్రకు బెస్ట్ అనార్మడు కంటింజెంట్ తృతీయ బహుమతి లభించింది. విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరిగిన స్వాతంత్ర దినోత్సవ వేడుకలో పాల్గొని సీఎం చంద్రబాబు నుంచి బెస్ట్ అనార్మడు కంటింజెంట్ తృతీయ బహుమతి అందుకున్నాడు. కళాశాలలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాగఫణీంద్రను ప్రిన్సిపాల్ శివనాథ్ ప్రత్యేక అధికారి సత్యనారాయణ, ఎన్‌సీసీ ఆఫీసర్ పి.శ్రీరామ్‌తేజ అభినందించారు.

పెండింగ్ సమస్యలను పరిష్కరించాలి

సీఐటీయూ అనుబంధ యూనియన్ల డిమాండ్



కమిషనర్ షేక్ నజీర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నేతలు

పెనమలూరు, ఆగస్టు18 (ఆంధ్రజ్యోతి): తాడిగడప మునిసిపాలిటీలో వర్కర్లకు సంబంధించిన పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ అనుబంధ మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులు డిమాండ్ చేశారు. సోమవారం వారు వర్కర్లకు సంబంధించిన సమస్యలపై పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మునిసిపల్ కమిషనర్ షేక్ నజీర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ, యూనియన్‌కు తెలియకుండా 50మంది బయట వ్యక్తులను మున్సిపాలిటీలో పనిలోకి తీసుకోవడం అన్యాయమన్నారు. వర్కర్‌లకు నిలిసిపోయిన హెల్త్ అలవెన్స్‌లు వెంటనే అందజేయాలని, అదేవిధంగా గత ఏడాది జనవరిలో చేసిన సమ్మె కాలానికి 8రోజులు సమ్మె వేతనం కార్మికులకు ఇవ్వాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసినా ఇవ్వకపోవడం అన్యాయని యూనియన్ నేత కాశీం ఆరోపించారు. సమస్యలు నెలరోజుల్లో పరిష్కరించకుంటే ఆందోళనకు దిగుతామని యూనియన్ నేతలు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సరళ, మధిర ఏడుకొండలు, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తెంపల్లెలో ఫీవర్ సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

గన్నవరం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెల్త్ సూపర్‌వైజర్ అంకూరి నాగమల్లేశ్వరరావు అన్నారు. ఆత్కూరు పీహెచ్‌సీ పరిధిలోని తెంపల్లి, బల్లిపర్రు గ్రామాల్లో ఫీవర్ సర్వే సోమవారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి జ్వర పీడితుల వివరాలను నమోదు చేశారు. ఈ సందర్భంగా నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ, కురుస్తున్న వర్షాలకు వైరల్ ఫీవర్స్ వస్తాయని, రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వివరించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచనలు చేశారు. జ్వరం వస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని లేకపోతే టైఫాయిడ్, మలేరియా, డెంగ్యూ జ్వరాలకు దారితీస్తాయని చెప్పారు. ఆశ వర్కర్లు దుర్గ, మేరీ తదితరులు పాల్గొన్నారు.

నాలుగేళ్ల తరువాత రాజకీయాల్లోకి..!

● సినీ హీరో సుమన్



తిరువూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): తాను రాజకీయాల్లోకి రావడానికి ఇంకా నాలుగేళ్ల సమయం ఉందని సినీ హీరో సుమన్ అన్నారు. సోమవారం పట్టణంలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహావిష్కరణ అనంతరం విలేకరులతో మాట్లాడుతూ హీరోగా ఎదగటానికి ఆ దేవుడి దయ ఉందని, రాజకీయాల్లో రావాలన్నా కూడా ఆ దే వుడి దయే ఉండాలన్నారు. ప్రస్తుతం తాను తెలుగు, తమిళంలో నాలుగు సినిమాల్లో నటిస్తున్నానని, త్వరలో విడుదల కాబోతున్నాయన్నారు. వెనుకబడిన వర్గాల్లో పుట్టిన యువత ఉన్నత చదువులు చదివి సామాజికంగా, ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. గత ఎన్నికల్లో ప్రజలకు మంచిచేసేవాళ్ల తరపున సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం చేశానని, తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడిని గెలిపించాలని, వాయిస్ మెసేజ్ ప్రచారం చేసినట్టు తెలిపారు.



అమెరికా బృందానికి వివరాలు చెబుతున్న మత్స్యశాఖ అధికారులు

గుడివాడ ఆక్వాల్యాబ్‌కు అమెరికా బృందం

గుడివాడ రూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక మార్కెట్ యార్డులోని ఆక్వా ల్యాబ్ నందు ఇంటిగ్రేటెడ్ ఆక్వా ల్యాబ్‌ను యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా, ఫుడ్ అండ్ డ్రగ్స్ అడ్మినిస్ట్రేటివ్ బృంద సభ్యులు సందర్శించారు. ఈ సందర్భంగా ల్యాబ్‌లో జరుగుతున్న వివరాలను అడిగి తెలుసుకున్నట్టు మత్స్యశాఖ జిల్లా సంయుక్త సంచాలకులు అయ్యా నాగరాజు సోమవారం తెలిపారు. ఈ బృందాలు గుడివాడ మార్కెట్ యార్డును సందర్శించి మత్స్యశాఖ అధికారులు, సిబ్బందితో వివిధ అంశాలపై చర్చించారు. గుడివాడ చుట్టుపక్కల 42 వేల ఎకరాలు ఆక్వా కల్చర్ సాగవుతుందన్నారు. ఈ ఆక్వా ల్యాబ్‌లో 10 వేల మంది రైతులకు ల్యాబ్ పరీక్షలు నిర్వహించామన్నారు. ఆక్వా ల్యాబ్‌లో అన్ని వసతులున్నాయని తెలిపారు. ప్రతి రైతుకు గుడివాడ ఆక్వా ల్యాబ్ అందుబాటులో ఉందన్నారు. గుడివాడ ఎఫ్‌డీవో సీహెచ్ ప్రసాద్, మంజుష, రవికుమార్, మత్స్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



నిందితులతో ఎస్సై శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ రాజేంద్ర

గంజాయి విక్రేతల అరెస్టు, కోర్టుకు తరలింపు

హనుమాన్‌జంక్షన్ రూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): రేమల్లెలో ఒడిశాకు చెందిన వ్యక్తి బడ్డీ కొట్టు ద్వారా గంజాయి సరఫరా చేస్తున్న ముఠాను వీరవల్లి పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం ఒడిశాకు చెందిన శరత్‌కుమార్ సేథ్ కొన్నేళ్ల క్రితం రేమల్లెలోని మోహన్‌స్పింటెక్స్‌లో కార్మికుడిగా చేరాడు. స్థానికంగా మధుసూదనరావు అనే వ్యక్తి ఇంటిలో నివాసముంటూ ఫ్యాక్టరీలో ఉద్యోగం మానివేసి ఆదే ఫ్యాక్టరీ ఎదురుగా బడ్డీకొట్టు పెట్టుకుని సిగరెట్లు, గుట్కాలు అమ్ముతున్నాడు. కొన్ని నెలలుగా గంజాయి విక్రయాలు ప్రారంభించినట్టు అనుమానంతో నిఘా పెట్టి సోమవారం డిప్యూటీ తహసీల్దార్ రాజేంద్ర, సీఐ సత్యన్నారాయణ పర్యవేక్షణలో ఆకస్మిక దాడి చేయగా 3కిలోల గంజాయి లభించిందని ఎస్సై తెలిపారు. ఒడిశా ప్రాంతం నుంచి కిలోల మేర గంజాయి తెచ్చి బాపులపాడు, నూజివీడు, గుడివాడ మండలాల్లోని పొట్లాలు కట్టి విక్రేతలకు సరఫరా చేస్తున్నాడని వివరించారు. ఆయా మండలాలకు చెందిన వ్యక్తులు ఇతడి వద్ద గంజాయి కొని సేవించడంతో పాటు ఇతరులకు సరఫరా చేస్తున్నారన్నారు. ఆకస్మిక దాడిలో గంజాయి విక్రేత శరత్‌కుమార్ సేథ్‌తో పాటు హనుమాన్‌జంక్షన్, అప్పనవీడు, గుడివాడకు చెందిన ఐదుగురిని అరెస్ట్ చేసి వారి నుంచి గంజాయి స్వాధీనం చేసుకుని నిందితులను నూజివీడు కోర్టుకు తరలించినట్టు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.



ఆపరేషన్ అనంతరం రోగితో వైద్య బృందం

ముక్కులో కణితి తొలగింపు


మాచవరం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లా తిరువూరు మండలం వావిలాల గ్రామానికి చెందిన చిన్ని కృష్ణయ్య (48) ముక్కులో భారీ కణితతో బాధపడుతూ విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో చేరాడు. అతడికి అత్యంత క్లిష్టమైన ఆపరేషన్‌ను ఈఎన్‌టీ డిపార్ట్‌మెంట్ వైద్యుడు కొణిదె రవి ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించి కణితిని తొలగించారు. న్యూరో ఎక్టోడెర్మల్ ట్యూమర్ 10 వేల మందిలో ఒకరికి వస్తుందని దీని ఆపరేషన్‌కు లక్షల్లో ఖర్చవుతుందన్నారు. ప్రస్తుతం రోగి ఆరోగ్యంగా ఉన్నాడన్నారు. ఈ ఆపరేషన్‌లో లీలా ప్రసాద్, డాక్టర్ వినయ్‌కుమార్, డాక్టర్ శాంతిలత పాల్గొన్నారు.



ఎంపికైన వాలీబాల్ బాలుర, బాలికల క్రీడాకారులు

అంతర్జాతీయ పోటీల ఎంపికకు బాలబాలికలు

విజయవాడ స్పోర్ట్స్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): డిసెంబర్ 4 నుంచి 13 వరకు చైనా దేశంలోని షాంగ్లావో నగరంలో జరగనున్న వరల్డ్ స్కూల్ వాలీబాల్ చాంపియన్ (అండర్-15 బాలుర, బాలికలు)లో పాల్గొనే భారత జట్టు ఎంపికకు జాతీయస్థాయి ఎంపికలు మహారాష్ట్ర, పూణే, బలేవాడిలో జరుగనున్నాయి. బాలుర ఎంపికలు ఈ నెల 25, 26, 27 తేదిల్లో, బాలికల ఎంపికలు ఈ నెల 28, 29, 30 తేదిల్లో జరగనున్నాయి. ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారుల ఎంపికలకు రాష్ట్ర అండర్-15 బాలబాలికల రాష్ట్రస్థాయి వాలీబాల్ జట్ల ఎంపికలు సోమవారం పటమటలోని కోనేరు బసవయ్య చౌదరి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ ఎంపికల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి 46 మంది బాలురు, 41 మంది బాలికలు హాజరయ్యారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా మార్గదర్శకాలకు అనుగుణంగా క్రీడాకారులను ఎంపిక నిర్వహించినట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ ఎంపికలు ఎన్టీఆర్ జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో స్కూల్ గేమ్స్ సెక్రటరీ ఎం శ్రీనివాసరావు పర్యవేక్షణలో జరిగాయి. పాఠశాల ప్రధానోపాధ్యాయులు వీవీఎస్ సత్యన్నారాయణ, పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కొండపై బిక్కు బిక్కు..!

కొండ ప్రాంతవాసులకు వర్షాకాలంలో తప్పని తిప్పలు

- జారిపడుతున్న కొండచరియలు, రిటైనింగ్ వాల్స్
- వణికిపోతున్న కొండ ప్రాంతవాసులు
- బెజవాడ జనాభాలో 30 శాతం మంది కొండలపైనే ఆవాసం
- ప్రమాదం అంచులో 960 నివాసాలు
- పట్టించుకోని రెవెన్యూ, వీఎంసీ అధికారులు
- ఎన్ని ప్రమాదాలు జరిగినా కొండ దిగిరానంటున్న ప్రజలు

ఆంధ్రజ్యోతి, కార్పొరేషన్: ముసురుకున్న వాతావరణంతో నగరంలోని కొండ ప్రాంతాల ప్రజలు గజగజలాడుతున్నారు. ఇటీవల వరుసగా వర్షాలు పడటంతో కొండలు నానాయి. తాజాగా ముసురు పట్టడంతో మరింతగా నానుతున్నాయి. ఇటీవల ఫ్రైజర్‌పేట కొండపై రిటెయినింగ్ వాల్ విరిగి పడింది. ముసురు వాతావరణం, భారీ వర్షాలతో ఆయా ప్రాంతాల్లో ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. నగర జనాభాలో 30 శాతం మంది కొండపైనే జీవిస్తున్నారు. ముసురు పట్టినా, నాలుగైదు రోజులు వర్షాలు కురిసినా కొండ ప్రాంతాలు వణికిపోవాల్సిందే. ఇక్కడి ప్రజలకు రక్షణ కల్పించటానికి రిటెయినింగ్ వాల్స్ మాత్రమే పరిష్కారం. ఈ దిశగా అధికార యంత్రాంగాలు ఎప్పుడు కదులుతాయో తెలియని పరిస్థితి.

ఇతర ప్రాంతాల తరహాలో మన కొండలుండవు. ఇంద్రకీలాద్రి, గుణదల కొండ, గాంధీ కొండ వంటి భారీ కొండ సానువులు సైతం రాతి, మట్టి కలబోతతో కూడి ఉంటాయి. ఇలాంటి కొండలు జానావాసాలకు సురక్షిత ప్రాంతాలు కావు. దీంతో భారీ వర్షాల సమయంలోనూ, ముసురుపట్టినప్పుడు, కొండలపై మట్టి నాని రాళ్లు బయట పడుతున్నాయి. ఇవి జనావాసాలపైకి దొర్లటం, రిటైనింగ్ వాల్స్‌ను కూలడం వంటి ప్రమాదాలు సంభవిస్తున్నాయి. మొగల్రాజపురం కొండప్రాంతం, గుణదల, చిట్టినగర్, కొత్తపేట, గొల్లపాలెంగట్టు, సొరంగం, ఫ్రైజర్‌పేట, లంబాడిపేట, రామరాజ్యనగర్ ప్రాంతాల్లో సుమారు 30వేల కుటుంబాలు నివాసముంటున్నాయి. వీరంతా కూలీనాలీ చేసుకునే పేద, మధ్యతరగతివారు. దశాబ్దాల కిందట నగరానికి వలస వచ్చి కొండలపైనే నివాసం ఏర్పరుచుకుని జీవిస్తున్నారు. గొల్లపాలెం గట్టు, సొరంగం, భీమన్నవారిపేట ప్రాంతంలో జారి పడిన కొండరాళ్లు, గతంలో సంభవించిన ఘటనలు మరింత భయాందోళనకు గురిచేస్తున్నాయి.

మొగల్రాజపురం సున్నపుబట్టీల సెంటర్ కొండ ప్రాంతలో గతేడాది ఇదే సమయంలో కొండచరియలు విరిగిపడి ముగ్గురు మృతి చెందారు. గతంలో లంబాడీపేట ప్రాంతంలో గోడకూలి నలుగురు మృతి చెందారు. అప్పటి నుంచి కొండ ప్రాంతాల్లో నివాసితులకు వర్షాకాలం వచ్చిందంటే కంటిపై కునుకు ఉండదు. ఎప్పుడేం ప్రమాదం ముంచుకొస్తుందోనని నిత్యం బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు. దీంతో ప్రమాదస్థాయిలో ఉన్న ఇళ్లను గుర్తించి చర్యలు చేపటేందుకు గతంలో నగరపాలక సంస్థ, రెవెన్యూ జాయింట్ సర్వే నిర్వహించారు.

ప్రమాదపుటంచున 960 నివాసాలు

కార్పొరేషన్, రెవెన్యూ అధికారుల జాయింట్ సర్వేలో నగర వ్యాప్తంగా సుమారు 960 ఇళ్లు ప్రమాదపు అంచున ఉన్నట్టు గుర్తించారు. సర్వే నిర్వహించి ఏళ్లు గడుస్తున్నా ఎలాంటి చర్యలు లేకపోవడం గమనార్హం. కొండరాళ్లు పడి ఎవరైనా మరణిస్తే వారి కుటుంబసభ్యులను పరామర్శించి అంతో ఇంతో ఆర్థిక సాయం చేసి చేతులు దులుపుకుంటున్నారే తప్ప రిటైనింగ్‌వాల్ నిర్మించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్నచోట యుద్ధ ప్రాతిదికన రిటైనింగ్ వాల్ నిర్మించి తమను కాపాడాలని వారు కోరుతున్నారు.

కొండదిగిరాలేమంటున్న ప్రజలు

వర్షాలు కురిసినప్పుడు ప్రమాదభరితంగా ఉన్న కొండప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు, పునరావాస కేంద్రాలకు వెళ్లాలని వీఎంసీ అధికారులు ప్రచారం చేస్తున్నా అక్కడున్న ప్రజలు మాత్రం వెళ్లటంలేదు. దీంతో కొన్నిచోట్ల ప్రమాదం జరిగిన సందర్భాల్లో అధికారులు ఏం చేయలేని పరిస్థితి. రిటైనింగ్ వాల్ నిర్మించలేని కొండ ప్రాంత ప్రజలకు వీఎంసీ జేఎన్ఎన్‌యుఆర్‌ఎం ఇళ్లు కేటాయించి తరలిపోవాలని చెబుతున్నా పట్టించుకోవడంలేదని అధికారులు చెబుతున్నారు.



ఒక కర్మాగారంలో తటాకాన్ని తలపిస్తున్న రసాయన వ్యర్థాలు

పారిశ్రామికవాడలో ప్రమాద ఘంటికలు

- రోడ్డెక్కిన కెమికల్ వ్యర్థాలు
- ఫార్మా కంపెనీల నిర్లక్ష్యంతో భూగర్భజలాలు విషతుల్యం
- జగ్గయ్యపేటకు ముంచుకొస్తున్న ముప్పు
- తాజా ఘటనతో ప్రజల్లో ఆందోళన

ఆంధ్రజ్యోతి-జగ్గయ్యపేట: జగ్గయ్యపేట సమీపంలోని జాతీయ రహదారిపై పారిశ్రామికవాడ/ఆటోనగర్‌లో ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. కొన్నేళ్లుగా రసాయన వ్యర్థాలను కెమికల్ ఫ్యాక్టరీలు, ఫార్మా కంపెనీలు నిర్లక్ష్యంగా భూగర్భంలోకి వదలటంతో ఆ జలాలు విషతుల్యంగా మారుతున్నాయి. నీరు రంగుమారి దుర్వాసనతో వాడకానికి కూడా పనికి రాకుండా పోతున్నాయి. జగ్గయ్యపేట పారిశ్రామికవాడ/ఆటోనగర్‌లో 6 ఫార్మా కర్మాగారాలున్నాయి. వివిధ రకాల మందులు, బల్క్ డ్రగ్‌లు తయారు చేస్తుంటాయి. వీటి తయారీలో ఉత్పన్నమయ్యే వ్యర్థాలను శుద్ధి చేయకుండా భూమిలోకి వదిలి వేయటంతో సమస్య ప్రారంభమైంది. కొన్నేళ్ల క్రితం ఈ విషయమై ఆటోనగర్, పారిశ్రామిక వాడల్లో యజమానులు ఫిర్యాదు చేయటంతో ఒక బోర్ వెల్ లోకి రసాయనవ్యర్థాలు వదిలినట్టు తేలింది. దీంతో ఆటోనగర్‌లో బోర్లలో నీరు మొత్తం రంగు మారిపోయి, దుర్వాసన రావటంతో పనికి రాకుండా పోయాయి. ఆ దెబ్బకు ఆటోనగర్‌లో అనేక మంది వర్కర్లు ఖాళీ చేశారు. ఇప్పటికీ అనేక దుకాణాలు ఖాళీగా, గోడౌన్‌లుగా మారిపోయాయి. తాజాగా భూగర్భజలాల్లో చేరిన రసాయన వ్యర్థాలు పట్టణ శివార్లలోని శాంతినగర్, టీచర్స్ కాలనీ, షేర్‌మహ్మద్‌పేట క్రాస్ రోడ్లలో భూగర్భజలాల్లోకి చేరి కలుషితమైయ్యాయి. ఇదిలా ఉండగా కొన్ని కంపెనీలు తాత్కాలికంగా మూసివేశారు. కొంతకాలం తర్వాత ప్రారంభించారు. ఇంత జరిగినా కాలుష్య నియంత్రణ మండలి అధికారులు తనిఖీలు సక్రమంగా చేయడం లేదు. కెమికల్ ఫ్యాక్టరీల వ్యర్థాలను ఖాళీగా ఉన్న ప్లాట్లలోకి గుట్టు చప్పుడు కాకుండా వదులుతున్నాయి. వాటిని ఆధారంగా కొద్దిరోజులుగా కురిసిన భారీ వర్షాలకు ఆటోనగర్‌లో వర్షపునీరు నిలిచిపోవటంతో లోపలున్న వ్యర్థ రసాయనాలు కలిసిపోయి రంగు మారిపోయాయి. కొన్ని కర్మాగారాలు వర్షపు నీటిలో వదిలేసినట్టు ఆరోపణలు వస్తున్నాయి. పారిశ్రామిక వాడ, ఆటోనగర్‌లో ఎక్కడ చూసిన రసాయనాలు కలిసిన తటాకాలు దర్శనమిస్తున్నాయి. ఈ కర్మాగారాల దాష్టీకానికి జగ్గయ్యపేట భూగర్భజలాలు విషంగా మారిపోయే ప్రమాదం నెలకొంది. కాలుష్య నియంత్రణ మండలి అధికారులు తరచూ ఆకస్మిక తనిఖీలు నిర్వహించటం, రసాయన వ్యర్థాలను దూరప్రాంతాలకు తరలించటంపై నిఘా ఏర్పాటు చేస్తేనే కొంత ఫలితం ఉంటుందని చెప్పారు.

ఎదుగుతూ.. ఎదిగేలా చేయి అందిస్తాం

● పీ4లో భాగస్వాములైన బిల్డర్స్ అసోసియేషన్, వర్థమాన్ వికాస్ సంస్థ

కలెక్టరేట్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): సమాజాన్ని పేదరికం నుంచి దూరం చేయాలనే గొప్ప లక్ష్యంతో ముఖ్యమంత్రి దార్శనికతకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం వినూత్నంగా ప్రారంభించిన పీ-4 విధానంలో మేము సైతం భాగమవుతామంటూ ప్రతిరోజు ఎంతోమంది, ఎన్నో సంస్థలు స్వచ్ఛందంగా ముందుకొస్తున్నాయి. తాజాగా సోమవారం బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (విజయవాడ సెంటర్), వర్థమాన్ వికాస్ సంస్థ వరుసగా 74 బంగారు కుటుంబాలు, 60 బంగారు కుటుంబాలకు మార్గదర్శనం చేస్తామంటూ పీ4తో చేతులు కలిపాయి. ఈ మేరకు సంస్థల ప్రతినిధులు కలెక్టర్ లక్ష్మీశకు ఆసక్తిని తెలియజేస్తూ ప్రమాణపత్రాలు అందించాయి. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ పీ4లో భాగస్వాములైనందుకు బిల్డర్స్ అసోసియేషన్, వర్థమాన్ వికాస్ సంస్థలకు ధన్యవాదాలు తెలియజేస్తున్నట్టు తెలిపారు. ఇప్పటికే జిల్లాలో 6,102 మంది మార్గదర్శులు 53,370 బంగారు కుటుంబాలను దత్తత తీసుకొన్నట్టు కలెక్టర్ వెల్లడించారు. బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా విజయవాడ సెంటర్ చైర్మన్ జే వెంకటేశ్వరరావు, ఎన్ నరేంద్రతో పాటు వర్థమాన్ వికాస్ సంస్థ సభ్యులు సీతల్ జైన్, యోగేష్ జైన్, మోనికా జైన్, ప్రియా జైన్, స్తుతి జైన్, యష్మీ జైన్ భాగస్వాములయ్యారు.



కలెక్టర్‌కు ప్రమాణపత్రాలు అందిస్తున్న బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, వర్థమాన్ వికాస్ సెంటర్ ప్రతినిధులు

వేగంగా మట్టి గణపతి విగ్రహ పనులు



విద్యాధరపురం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పండుగను పురస్కరించుకుని డూండీ గణేష్ సేవా సమితి ఆధ్వర్యంలో విజయవాడ విద్యాధరపురం సితార సెంటర్ లేబర్ కాలనీ గ్రౌండ్‌లో ఏర్పాటు చేస్తున్న 72 అడుగుల మట్టి శ్రీకార్యసిద్ధి మహాశక్తి గణపతి విగ్రహం నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. 72 అడుగుల డూండీ గణపతితో పాటు ఈ ఏడాది 21 అడుగుల శ్రీనగరేశ్వర స్వామి, శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి విగ్రహాలు కూడా ఏర్పాటు చేస్తున్నారు. ప్రపంచంలో మునుపెన్నడూ చూడని విధంగా ఈ ఏడాది ఉత్సవాలకు కూర్చున్న వినాయకుడి భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారు. డూండీ గణేష్ సేవా సమితి వ్యవస్థాపకుడు డూండీ రాకేష్ ఆధ్వర్యంలో ఖైరతాబాద్ వినాయక విగ్రహం తయారు చేసేవారే ఈ భారీ మట్టి వినాయక విగ్రహాన్ని తయారు చేస్తున్నారు. సెప్టెంబరు 1 నాటికి రంగులు వేసి వినాయక విగ్రహాన్ని సిద్ధం చేయనున్నారు. ఈనెల 28 నుంచి సెప్టెంబరు 9 వరకు ఉత్సవాలు జరగనున్నాయి.



కోడూరు మండలం వి.కొత్తపాలెం వద్ద నీటి ముంపులో పంట పొలాలు

భారీ వర్షాల హెచ్చరికలు..
ఆందోళనలో దివి రైతులు

- ఇంకా నీటిలోనే వరిపొలాలు
- నీటిని బయటికి పంపేందుకు రైతుల యత్నాలు

అవనిగడ్డ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా మరో మూడు రోజులపాటు భారీ వర్షాలు కురుస్తాయన్న హెచ్చరికలతో దివి ప్రాంత రైతులు తీవ్ర ఆందోళనను వ్యక్తం చేస్తున్నారు. వారం క్రితం కురిసిన భారీ వర్షాలకు ఇప్పటికే నాగాయలంక, కోడూరు మండలాల్లోని తీరప్రాంత గ్రామాలు, మోపిదేవి, చల్లపల్లి మండలాల్లోని లోతట్టు పంట పొలాల్లో వేసిన వరి నాట్లు నీటమునిగిపోగా, వాటిలో అధిక భాగం ఇప్పటికీ నీటిలోనే నానుతున్నాయి. నీటమునిగిన వరి నాట్లను కాపాడుకునేందుకు నాగాయలంక, కోడూరు మండలాల్లోని రైతులు పంట కాలువల్లోకి, మురుగుకాలువల్లోకి గండ్లు కొట్టి ముంపు నీటిని బయటికి పంపేందుకు ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ రత్నకోడు, మిగిలిన మైనర్ డ్రెయిన్లు పారుదల లేకపోవడంతో ఎక్కడి నీరు అక్కడే నిలిచిపోయాయి. కోడూరు మండలం జయపురం, ఉల్లిపాలెం, మందపాకల, గుడుమోటు, నాగాయలంక మండలం భావదేవరపల్లి, కమ్మనమోలు, చోడవరం, గుల్లలమోద, పెదకమ్మవారిపాలెం, ఏటిమొగ ప్రాంతాల్లో ఇప్పటికీ పంట పొలాలను ముంచెత్తిన నీరు ఎటూ కదలకుండా నిలిచిపోయింది. పుండు మీద కారం చల్లినట్లుగా మళ్లీ అధిక వర్షాల హెచ్చరికలు, సోమవారం ఒక్కరోజే దాదాపు 30 నుంచి 40 మిలిమీటర్ల వర్షపాతం దివి ప్రాంతంలో నమోదు కావటంతో ఎగువ ప్రాంతం నుంచి వచ్చే మురుగునీటితో నాగాయలంక, కోడూరు, చల్లపల్లి, మోపిదేవి మండలాల్లోని ప్రధాన డ్రెయిన్లు పోటెత్తుతుండటంతో వేసిన నాట్లు దక్కుతాయా? లేదా అన్న ఆందోళనలో ఈ ప్రాంత రైతులున్నారు.



జయపురం వద్ద కోడూరు పంట కాలువకు గండి, అశ్వారావుపాలెంలో నీటి ముంపులో పొలాలు



డైవర్షన్ రహదారిపై ప్రవహిస్తున్న వరద, రాకపోకలు జరగకుండా రహదారిని బంద్‌చేసిన పోలీసులు

ఏడు రోజులుగా రాకపోకలు బంద్

- కట్టలేరు డైవర్షన్ రహదారిపై తగ్గిన ప్రవాహం
- రోడ్డంతా శిథిలమై పైకి లేచిన రాళ్లు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న 20 గ్రామాల ప్రజలు

తోటమూల (గంపలగూడెం) ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో ఎగువున కురుస్తున్న భారీ వర్షాలకు, తోటమూల-వినగడప రహదారి మధ్యలోని కట్టలేరు డైవర్షన్ రహదారిపై రాకపోకలు నిలిచిపోయి సోమవారం నాటికి ఏడవ రోజుకు చేరుకుంది. డైవర్షన్ రహదారిపై ప్రవాహ ఉధృతి తగ్గిపోవడంతో, డైవర్షన్ రహదారి అంతా గండ్లు పడి రాళ్లు, గతంలో రోడ్డునిర్మాణంలో వేసిన తూరలు బైటపడ్డాయి. ప్రవాహ ఉధృతి తగ్గిన తరువాత అధికారులు యుద్ధప్రాతిపదికన రహదారికి పడిన గండ్లు పూడ్చివేత, గ్రావెల్‌లో మరమ్మతులు చేపట్టడం, సుదీర్ఘసమయం పట్టే పరిస్థితి నెలకొంది. ముందుజాగ్రత్తల్లో భాగంగా పోలీసులు డైవర్షన్ రహదారిపై రాకపోకలు నిలిపివేస్తూ రహదారికి ఇరువైపుల స్టాప్‌బోర్డులు, ముళ్లకంచె వేశారు. దాదాపు 20 గ్రామాలకు చెందిన ప్రజలు వారి పనుల ఒత్తిడి మేరకు 20 కిలోమీటర్లు అదనంగా ప్రయాణించి, గంపలగూడెం తోటమూల గ్రామాలకు చెరుకునే పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా వైద్య సదుపాయం, రైతులు తమ పంటభూములకు అవసరమైన ఎరువులు, పురుగుమందులు, ప్రైవేటు పాఠశాలలకు వెళ్లే విద్యార్థులకు, చిరువ్యాపారుల రాకపోకలపై తీవ్ర ప్రభావం చూపిస్తోంది. మండలంలోని కనుమూరు, అనుముల్లంక, వినగడప, కొత్తపల్లి, నారికింపాడు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోవడడంతో, తోటమూల, గంపలగూడెం గ్రామాల్లో నిర్వహిస్తున్న వ్యాపారాలు ఉన్నఫళంగా పడిపోయాయి. కట్టలేరుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టే వరకు ప్రజలకు ఈ ఇబ్బందులు తప్పేలా లేవని మండల ప్రజలు వాపోతున్నారు.



వరదను పరిశీలిస్తున్న నల్లగట్ల స్వామిదాసు బృందం

కట్టలేరుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలి

గంపలగూడెం: ఏడురోజులుగా కురుస్తున్న వర్షాలకు తోటమూల-వినగడప రహదారిలో కట్టలేరు డైవర్షన్ రహదారిపై ప్రవహిస్తున్న వరదనీటిని, మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం వెంటనే స్పందించి నూతన హైలెవల్ బ్రిడ్జిని నిర్మించాలని డిమాండ్ చేశారు. బ్రిడ్జి నిర్మాణంతోనే సమస్యకు శాశ్వత పరిష్కారమన్నారు. రాకపోకలు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. జడ్పీటీసీ కోట శామ్యూల్, పార్టీ నేతలు మందపాటి ఉమామహేశ్వరరెడ్డి, చెరుకు నర్సారెడ్డి, వంగల వైకుంఠం, కోట దాసు, కోటేశ్వరరావు, నల్లగట్ల బాలు, కొంగల వినాయకరావు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 505

బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి సన్మానం

గుడ్లవల్లేరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : అంగలూరు బాలికోన్నత పాఠశాల రాష్ట్ర ఉత్తమ పాఠశాలగా ఎంపికైన సందర్భంగా ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, గుడ్లవల్లేరు ఎంఈవో -1 జగన్మోహనరావును కార్యాలయ సిబ్బంది సోమవారం సన్మానించారు. ఇటు ప్రధానోపాధ్యాయుడిగా, అటు ఎంఈవోగా రెండు బాధ్యతలూ విజయవంతంగా నిర్వహిస్తూ పాఠశాల ను ఆదర్శవంతంగా జగన్మోహనరావు తీర్చిదిద్దారని ఎంఈవో (2) గోపాలరావు అభినందించారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు, సిబ్బంది పాల్గొన్నారు.



ఎంఈవో జగన్మోహనరావును సన్మానిస్తున్న సిబ్బంది

ఉచిత ప్రయాణం .. మహిళలకు వరం

- కిటకిటలాడుతున్న ఆర్టీసీ ఉచితబస్సు
- బస్సులు ఎక్కేటప్పుడు తప్పని తొక్కిసలాట
- ఉద్యోగులకు, విద్యార్థినులకు ఉపయోగకరం

(ఆంధ్రజ్యోతి - పామర్రు): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మహిళలకు ఆర్థిక వెసులుబాటు కల్పించేందుకుగాను ప్రవేశ పెట్టిన స్త్రీశక్తి పథకం ద్వారా ఉచిత ఆర్టీసీ బస్సు సర్వీసులు ప్రారంభించడంతో మహిళా ప్రయాణికులతో బస్సులు కిటకిటలాడుతున్నాయి. సోమవారం నియోజకవర్గ కేంద్రమైన పామర్రులోని నాలుగు రోడ్ల కూడలి ప్రాంతం బస్సులు ఎక్కేందుకు మహిళలు తొక్కిసిలాడుకోవాల్సిన పరిస్థితి నెకొంది. పామర్రు నుంచి విజయవాడ, బందరు, ఇటు అవనిగడ్డ, గుడివాడ వైపు ఉన్న నలుదిక్కులకు వెళ్లే జంక్షన్ కావడంతో చాల రద్దీగా మారింది. శ్రావణ మాసంలో పుణ్యక్షేత్రాలను సందర్శించే మహిళలేకాకుండా, మహిళ ఉద్యోగులు, విద్యార్థులకు సందర్శన ప్రదేశాలకు చేరుకోవాలంటే వారికి నిన్నా మొన్నటి వరకు రవాణా చార్జీలు బారం ఉండేది. ఇప్పడు రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన ఉచిత ప్రయాణంతో వారిలో ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం పట్ల మహిళా ఉద్యోగులు, విద్యార్థినులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.



పామర్రు ఎన్టీఆర్ సర్కిల్‌లో ప్రయాణికులతో కిటకిటలాడుతున్న ఆర్టీసీ ఉచితబస్సు

డబ్బు ఆదా అవుతుంది



శ్రావణ మాసంలో ప్రవిత్ర పుణ్యక్షేత్రంగా ఉన్న మోపిదేవి సుబ్రమణేశ్వరస్వామి సన్నిదానంలో తమ బందువుల మనవడికి జరిగే అన్న ప్రాసన కార్యక్రమానికి తనతో పాటు మరో ముగ్గురం కలిసి బయల్దేరాం. ఉచిత బస్సు సౌకార్యంతో తమకు డబ్బు ఆదా జరిగింది.

బి. పద్మజ, ప్రయాణికురాలు

ఆర్థిక బాధలు తొలగుతాయి



పామర్రు నుంచి నిత్యం వేకువజామునే విజయవాడ పూల మార్కెట్‌కు పోయి పూలు కొనుగోలు చేసేందుకు రవాణా చార్జీ రూ.130 వరకు ఖర్చుయ్యేది. ఉచిత రవాణ బస్సుతో రూ.3వేలుకుపైగా ఆదాకలగడంతో ఆర్థిక బాధలు పోయినట్లే.

కుంపటి కుమారి, పూల వ్యాపారి

మద్యం దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

● ఎక్సైజ్ సీఐ వెంకటరమణ

గుడివాడ, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నూతన ఎక్సైజ్ బార్ పాలసీలో భాగంగా 2025-28 సంవత్సరాలకు గాను గుడివాడ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని గుడివాడ మున్సిపాల్టీ పరిధిలోని 10 మద్యం దుకాణాల్లో , ఒక మద్యం దుకాణాన్ని గౌడ కులస్తులకు కేటాయించామని, ఆసక్తిగలవారు దరఖాస్తు చేసుకోవాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సీఐ వెంకటరమణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను ఆఫ్‌లైన్, ఆన్‌లైన్, లేదా హైబ్రిడ్ మోడల్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ప్రతి దరఖాస్తుకు నాన్ రిఫండబుల్ రుసుం కింద రూ.5లక్షలు, దరఖాస్తు ఫీజు రూ.10వేలు చెల్లించాలని సూచించారు. ప్రతి మద్యం దుకాణానికి తప్పనిసరిగా నాలుగు దరఖాస్తులు వస్తేనే డ్రా తీయడం జరుగుతుందన్నారు. ఈ నెల 18వతేదీ నుంచి 28వ తేదీ వరకు మాత్రమే దరఖాస్తుల స్వీకరణ జరుగుతుందన్నారు. గౌడ కులస్తులకు కేటాయించిన బార్ తాలుకు ఈ నెల 29వతేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ, 30వ తేదీన డ్రా తీసి బార్‌లను కేటాయించనున్నామని ఎక్సైజ్ సీఐ తెలిపారు.



సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా

లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులు

పెదపారుపూడి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): వెంట్రప్రగడలో వెలగపూడి దుర్గారాణికి సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కును పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా సోమవారం అందజేశారు. వెంట్రప్రగడలోని దుర్గారాణి స్వగృహానికి వెళ్లిన ఎమ్మెల్యే కుమార్ రాజా యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రూ.78,213లు చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి, పీఏసీఎస్ అధ్యక్షుడు కూచిపూడి సుబ్బయ్య, మాజీ సర్పంచ్ గొరిపర్తి రవికుమార్, వునుగోటి సత్యనారాయణ, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎంపీడీవో విష్ణుప్రసాద్, మల్లాయిపాలెం కార్యదర్శి కోటయ్యలను సన్మానిస్తున్న సిబ్బంది

ఎంపీడీవోకి సన్మానం

గుడివాడ రూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): గుడివాడ రూరల్ మండల ఎంపీడీవో బి.వై.విష్ణుప్రసాద్, మల్లాయిపాలెం కార్యదర్శి కోటయ్యను మండల పరిషత్ సిబ్బంది, కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా సన్మానించి సత్కరించారు. ఆగస్టు 15వ తేదీన మంత్రి కొల్లు రవీంద్ర చేతులమీదుగా ఎంపీడీవో, కార్యదర్శి అవార్డులు అందుకున్నారు. అవార్డులు అందుకున్న సందర్భంగా కార్యదర్శి వి.హరికృష్ణ ఆధ్వర్యంలో ఇరువురిని సత్కరించారు. పలువురు ఎంపీడీవో, కార్యదర్శి చేసిన సేవలను కొనియాడారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేయాలి

● ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడ్లవల్లేరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : పదవులు అలంకార ప్రాయంగా కాక రైతుల ప్రయోజనాలకు, ప్రజల అవసరాలను తీర్చే విధంగా అందరినీ కలుపుకుంటూ పదవులకు వన్నెతెచ్చే విధంగా ఎదగాలని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. సోమవారం గుడ్లవల్లేరు మండలం వడ్లమన్నాడులో పీఏసీఎస్ నూతన త్రిమెన్ కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిధిగా పాల్గొని ప్రసంగించారు. ప్రజలకు మంచి జరిగేలా కృషిచేయడమే కూటమి నాయకుల లక్ష్యమన్నారు. తొలుత అధ్యక్షుడిగా అడపా చంద్రశేఖర్(బాబి), డైరెక్టర్లుగా మండా మురళీ నాంచారయ్య, అబ్దుల్ జమీర్‌లు ప్రమాణా స్వీకారం చేశారు. ముగ్గురినీ ఎమ్మెల్యే రాము, మండల టీడీపీ అధ్యక్షుడు కొసరాజు బాపయ్యచౌదరి, ఏపీ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ రావి వెంకటేశ్వరరావు, డీసీఎంఎస్ ఛైర్మన్ బండి రామకృష్ణ, గుడివాడ నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్‌లు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు అట్లూరి దిలీప్‌కుమార్, మండల జనసేన అధ్యక్షుడు తోట చిన్నారి, రాష్ట్ర టీడీపీ కార్యదర్శి సాయిన పుష్పావతి, జిల్లా టీడీపీ మాజీ ఉపాధ్యక్షుడు జంగం మోహనరావు, పాల్గొన్నారు.



వడ్లమన్నాడు త్రిమెన్ కమిటీని అభినందిస్తున్న నేతలు

రైతులకు అందుబాటులో ఉండాలి

● ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా

తోట్లవల్లూరు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థిక ఇబ్బందులున్నా రైతు సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. బొడ్డపాడు పీఏసీఎస్ త్రిమెన్ కమిటీ సోమవారం ప్రమాణ స్వీకారం చేసింది. ఛైర్మన్‌గా నిమ్మగడ్డ వెంకటరత్నం చౌదరి, సభ్యులుగా మార్గం శ్రీరామమూర్తి, శరణం కాశీ విశ్వేశ్వరరావు చేత సీఈవో మురళీ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా సదరు పాలకవర్గాన్ని ఎమ్మెల్యే కుమార్ రాజా, మండల టీడీపీ అధ్యక్షుడు వీరపనేని శివరామ్‌ప్రసాద్, జిల్లా తెలుగు యువత మాజీ అధ్యక్షుడు రామినేని కుటుంబయ్య, సర్పంచ్ మూడే శివశంకర్ ఘనంగా సన్మానించారు. అన్నదాత సుఖీభవ పథకం తొలివిడతగా కేంద్రం ఇచ్చిన రూ 2 వేలతో కలిసి రాష్ట్ర ప్రభుత్వం రూ. 7,000 రైతుల ఖాతాల్లో జమచేసిందన్నారు. వర్షాకాలానికి ముందుగానే కాలువల బాగుజేత పనులు చేయటం, రైతుల పట్ల సీఎం చంద్రబాబు నాయుడుకున్న ప్రత్యేక శ్రద్ధను తెలియజేస్తోందన్నారు. మాజీ సర్పంచ్ నిమ్మగడ్డ సీతారాంబాబు, పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ మాజీ అధ్యక్షుడు కనగాల వెంకట సత్యనారాయణ(చంటి), చింతపల్లి వెంకటేశ్వరరావు, చినపులిపాక టీడీపీ అధ్యక్షుడు మరీదు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



త్రిమెన్ సభ్యులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే కుమార్ రాజా

సాంకేతిక విద్యపై అవగాహన తప్పనిసరి

● వేములపల్లి కోదండరామయ్య

గుడివాడ, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి) : యువతరం బంగారు భవిష్యత్తును నాశనం కాకుండా ఉండాలంటే ప్రతి విద్యార్థీ సాంకేతిక విద్య, జీవన నైపుణ్యాలను కలిగి ఉండాలని కళాశాల కార్యదర్శి వేములపల్లి కోదండరామయ్య పేర్కొన్నారు. సోమవారం వీకేఆర్ అండ్ వీఎన్‌బీ ఇంజనీరింగ్ కళాశాలలో జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం, కాకినాడ వారి నిబంధనల మేరకు బీటెక్ ప్రథమ సంవత్సర విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వివిధ బ్రాంచ్‌ల విశిష్టత, మెరుగైన ప్రయోగశాలలు, క్రీడలు, ప్రాంగణ ఎంపికల గురించి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.హెచ్.వి ప్రసాదరావు వివరించారు. సీనియర్ విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. జి.శివపావని, బి.కల్యాణ్‌కుమార్, పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాదరావు

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

పెదపారుపూడి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): యలమర్రు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల 2005-06 సంవత్సరం పూర్వ విద్యార్థుల సమ్మేళనం సోమవారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు అందించిన రూ.35 వేలు విరాళంలో ఏర్పాటు చేసిన సైన్స్ ల్యాబ్‌ను ప్రారంభించారు. పూర్వ విద్యార్థులు పాఠశాల అభివృద్ధికి చేసిన కృషిని ఈ సందర్భంగా ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ వెంకట సత్యనారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఇ.మధుమోహన్‌రెడ్డి, సైన్స్ ఉపాధ్యాయుడు ఎస్.ఎస్.కె.కుమార్, సాంబశివరావు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



గురువులతో 2005-06 పూర్వ విద్యార్థులు

తాగునీరందించాలని నిరసన

గుడివాడ, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి) : లింగవరంలోని బ్రహ్మారెడ్డి కాలనీలో ఈ నెల 13వ తేదీనుంచి పంచాయతీ మంచినీటిని సరఫరా చేయడం లేదని, అధికారులు స్పందించి కాలనీకి నీటిని అందించాలని కాలనీకి చెందిన సామాజిక కార్యకర్త అత్తులూరి రవికిరణ్ కోరారు. సోమవారం స్థానిక మెయిన్‌రోడ్డులోని జ్యోతిరావు పూలే దంపతులు విగ్రహం వద్ద రవికిరణ్ చేతిల్లో ప్లేకార్డు పట్టుకుని అర్ధనగ్నంగా ఖాళీ బకెట్‌తో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీకి నీటిని సరఫరా చేయకపోవడంతో 50గృహాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈ నెల 13వ తేదీ నుంచి నీటిని సరఫరాను నిలిపి వేశారన్నారు. కనీసం పంచాయతీ కార్యాలయంలో అర్జీ ఇచ్చేందుకు వెళితే సచివాలయ సిబ్బంది తీసుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలనీకి మౌలిక వసతులను కల్పించాలని రవికిరణ్ డిమాండ్ చేశారు.



లింగవరం సచివాలయం వద్ద నిరసన తెలుపుతున్న రవికిరణ్



ఆర్వో ప్లాంటును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కుమార్ రాజా

గరికపర్రులో ఆర్వోప్లాంట్ పునః ప్రారంభం

తోట్లవల్లూరు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి) : గరికపర్రులో సెంట్రల్ బ్యాంకు ఆర్థిక సాయంతో పునర్నిర్మించిన మినరల్ వాటర్ ప్లాంటుని సోమవారం ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా ప్రారంభించారు. సెంట్రల్ బ్యాంకు రూ. 2 లక్షలు, గ్రామస్థుల సహకారంతో మినరల్ వాటర్ ప్లాంటుని పునర్నిర్మించటం హర్షణీయమని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నేత గొట్టిపాటి రామకృష్ణప్రసాద్, మండల టీడీపీ అధ్యక్షుడు వీరపనేని శివరామ్‌ప్రసాద్, సెంట్రల్ బ్యాంకు రీజనల్ మేనేజర్ సతీష్‌బాబు, సర్పంచ్ వీరంకి రమాదేవి, ఎస్‌వి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

కనకవల్లి డ్రెయిన్‌లో తూడు తొలగించాలి

తోట్లవల్లూరు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి) : కనకవల్లి డ్రెయిన్‌లో పేరుకున్న గుర్రపుడెక్క, తూటికాడ మురుగు ప్రవాహాన్ని అడ్డుకుంటోంది. దీంతో వరిపొలాల్లో మురుగు దిగని పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు. కుమ్మమూరు తూము వద్ద భారీగా తూడు పట్టేసి మురుగు దిగువకు పారటం లేదని రైతులు తెలిపారు. డ్రెయినేజీ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



కనకవల్లి డ్రెయిన్‌పై దట్టంగా పేరుకున్న గుర్రపుడెక్క

రక్తదానం

గుడివాడ, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి) : తట్టివర్రుకు చెందిన మేరీకి స్థానిక ఏరియా ప్రభుత్వాసుపత్రిలో చికిత్స నిమిత్తం అత్యవసరంగా రక్తం అవసరమవ్వడంతో ఆర్‌కే వారియర్స్ ఆధ్వర్యంలో సభ్యులు పుప్పాల వీరయ్య సోమవారం రక్తదానం చేశారు. రక్తదాత వీరయ్యను బీజేపీ టూటౌన్ అధ్యక్షుడు మాచర్ల రామకృష్ణ, లంకా రాంబాబు, గాదె చరణ్, మేరీ కుటుంబసభ్యులు, తదితరులు అభినందించారు.



ఎక్స్‌ప్రెస్ బస్సులో కిక్కిరిసిన మహిళలు

మహిళలతో కిటకిటలాడిన బస్సులు

తోట్లవల్లూరు: మండలంలో సోమవారం ఆర్టీసీ బస్సులు మహిళా ప్రయాణికులతో కిటకిటలాడాయి. స్త్రీ శక్తి పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించింది. అవనిగడ్డ నుంచి విజయవాడ వెళ్లే కరకట్ట ఎక్స్‌ప్రెస్ బస్సులు మహిళలతో రద్దీగా మారాయి. ఎగువ గ్రామాల్లోనే బస్సులు ప్రయాణికులతో నిండిపోవటంతో మండలంలోని చాలా గ్రామాల వద్ద ఆపకుండానే వెళ్లిపోవటం కనిపించింది. దీంతో విద్యార్థులు, ఉద్యోగాలకు వెళ్లే మహిళలకు ఆలస్యంగా బస్సులు దొరికాయి. డోర్ వరకు మహిళలు వేలాడుతు ప్రయాణించటం విశేషం. బస్సులు దిగిన మహిళలు ఉచిత బస్సు ప్రయాణం చాలా బాగుందని, ప్రయాణ ఖర్చులు ఆదా అవటం సంతోషంగా ఉందని చెప్పారు.

గురజాడను ఉయ్యూరు మండలంలో చేర్చాలి

పమిడిముక్కల : గురజాడ గ్రామాన్ని ఉయ్యూరు మండలంలో చేర్చాలని సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాసగౌడ్ ప్రభుత్వాన్ని కోరారు.గుర జాడను ఉయ్యూరు మండలంలో చేర్చటానికి రాష్ట్ర రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి తగు చర్యలు తీసుకో వాలని కోరుతూ కలెక్టర్‌కు అందజేసిన వినతిపత్రంలో పేర్కొన్నట్టు శ్రీనివాసగౌడ్ తెలిపారు. విజయవాడ- మచిలీపట్నం జాతీయ రహదారిలో అండర్‌పాస్‌లు రాత్రి వేళ లైట్లు వెలగడం లేదని, కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లారు.

సహకార సంఘాల బలోపేతమే కూటమి లక్ష్యం

● ఎమ్మెల్యే వెనిగండ్ల రాము



బొమ్ములూరు పీఏసీఎస్ అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న గుత్తా సుబ్రహ్మణ్యేశ్వరరావు

గుడివాడ రూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాలు బలోపేతానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. సోమవారం రామన్నపూడి పీఏసీఎస్‌లో సూరపనేని రామకృష్ణ (చిన్నబాబు) ఛైర్మన్‌గా తలారి రాజు, నరదల శివకృష్ణ డైరెక్టర్లుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఏపీవేర్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ రావి వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు జగన్మోహనరావు, టీడీపీ మండల అధ్యక్షుడు వాసే మురళీ, గుడివాడ మార్కెట్‌యార్డు వైస్‌ఛైర్మన్ సుబ్బారావు, టీడీపీ రామన్నపూడి అధ్యక్షుడు వెంకట నాగకోటేశ్వరరావు, ఇంటూరి గజేంద్ర, నీలిపాల వంశీ కృష్ణ పాల్గొన్నారు.

పమిడిముక్కల : పీఏసీఎస్‌ల ద్వారా రైతులకు మెరుగైన సేవలందించి కూటమి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. మండల పరిధిలో సోమవారం ఏర్పాటుచేసిన పీఏసీఎస్‌ల పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్నారు. గోపువానిపాలెం పీఏసీఎస్ ఛైర్మన్‌గా యార్లగడ్డ పిచ్చేశ్వరరావు, డైరెక్టర్లుగా కొలుసు శ్రీమంతరావు, చింతపల్లి వెంకటేశ్వరరావు చేత ప్రమాణ స్వీకారం చేయించారు. గ్రామసర్పంచ్ యార్లగడ్డ భూషయ్య, తెలుగు మహిళ జిల్లా అధికార ప్రతినిధి షైనేని ఇందిర, గ్రామ పార్టీ అధ్యక్షుడు రవిశంకర్, యార్లగడ్డ రాజేంద్రప్రసాద్ పాల్గొని పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలియచేశారు. హనుమంతపురం పీఏసీఎస్ ఛైర్మన్‌గా రాజులపాటి రామాంజనేయప్రసాద్, డైరెక్టర్లుగా అల్లాడ రాంబాబు, శివపార్వతి చేత ప్రమాణం చేయించారు. లింగమునేని బాబూరావు, వెంకట్రామయ్య, బొల్లా మల్లిఖార్జునరావు, మోపిదేవి శివనాగేశ్వరరావు తదితరులు శుభాకాంక్షలు తెలియేచేశారు. కపిలేశ్వపురం పీఏసీఎస్ ఛైర్మన్‌గా తాతినేని బాబూరావు, డైరెక్టర్లుగా ఎన్.చిరంజీవి, ఉమామహేశ్వరరావు ప్రమాణస్వీకారం చేశారు. స్థానిక పార్టీ నాయకులు సాయిదత్, బాబి పాల్గొన్నారు.



హనుమంతపురం పీఏసీఎస్ పాలకవర్గంతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే కుమార్‌రాజా

గుడివాడ రూరల్: ఉమ్మడి కూటమిలో కష్టపడిన అందరికి సముచిత స్థానం కల్పిస్తున్నట్లు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. సోమవారం బొమ్ములూరులో పీఏసీఎస్ ఛైర్మన్‌గా గుత్తా సుబ్రహ్మణ్యేశ్వరరావు, సభ్యులుగా అయ్యారు రాంపండు, మరీదు నాగరాజు నియమితులయ్యారు. ఏపీ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ రావి వెంకటేశ్వరరావు, మండల దేశం పార్టీ అధ్యక్షులు వాసే మురళీ, జనసేన అధ్యక్షుడు బూరగడ్డ శ్రీకాంత్, లింగమనేని నాగభూషణం, గొర్ల సుబ్బారావు, పాల్గొన్నారు.

నందివాడ : పోలుకొండ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘానికి కూటమి ప్రభుత్వం త్రిమెన్ కమిటీ పాలకవర్గాన్ని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. ఈ సందర్భంగా గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సూచనల మేరకు పోలుకొండ సహకార సంఘం అధ్యక్షుడిగా పర్వతనేని బసవ వెంకట విజయ ప్రసాద్, సభ్యులు తోట రామకృష్ణ, నేరేళ్ల సాయి నియమితులయ్యారు. ఈ సందర్భంగా బ్యాంక్ అధ్యక్షుడిగా ఎంపికైన విజయ ప్రసాద్(చినబాబు)కు పోలుకొండ గ్రామ సీనియర్ టీడీపీ నాయకులు బొర్రా సత్యనారాయణ పూలమాల వేసి అభినందనలు తెలిపారు. మాజీ ఎంపీటీసీ ఉప్పల వెంకటేశ్వరరావు, సర్పంచ్ మానేపల్లి ఝాన్సీ కుమారి, డీసీ అధ్యక్షుడు ఏసుబాబు, వెంకట కృష్ణారావు, బుజ్జిబాబు, తమ్మారెడ్డి శ్రీనివాసరావు, బానురాజు, సుధాకర్, శ్రీనివాసరావు, కృష్ణ, పూర్ణచంద్రరావు, ఉమాపతి పాల్గొన్నారు.



పోలుకొండ పీఏసీఎస్ కార్యాలయంలో ప్రమాణ స్వీకారం చేస్తున్న విజయ ప్రసాద్‌ను అభినందిస్తున్న టీడీపీ నాయకులు

నందివాడ : వెన్ననపూడి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షుడిగా సూరపనేని నాగేశ్వరరావు, సభ్యులుగా సింగవరపు సురేష్, నరసాపురం భవాని రంగ ప్రసాద్‌ను పీఏసీఎస్ కార్యదర్శి తుమ్మలపల్లి సత్యహనుమంతరావు సోమవారం ప్రమాణ స్వీకారం చేయించి బ్యాంక్ బాధ్యతలు అప్పగించినట్లు హనుమంతరావు తెలిపారు. సందర్భంగా పీఏసీఎస్ అధ్యక్షులుగా ఎంపికైన సూరపనేని నాగేశ్వరరావు తుమ్మలపల్లి సర్పంచ్ సింగాల రాధాకృష్ణ శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో గోగులపాటి గంగాధర్‌రావు, వెంకటేశ్వరరావు, స్వామి మురళీ, సుందరరావు, శేషయ్య, పాల్గొన్నారు.



రామన్నపూడి పీఏసీఎస్ అధ్యక్షుడిగా నియామకపత్రం అందుకుంటున్న రామకృష్ణ

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 505

రైలు పట్టాలకు మరమ్మతులు.. ట్రాఫిక్ మళ్లింపు



మచిలీపట్నం టౌన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : చిలకలపూడి రైల్వేగేటు వద్ద పట్టాలు తనిఖీ చేసి, మరమ్మతులు చేస్తున్నారు. పట్టాలను ఎక్స్‌కవేటర్లతో లేపి పరిశీలించారు. వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా డబుల్‌లైన్‌లో ఒక లైను మీదుగా రైళ్ల పోకలు జరుగుతున్నాయి. రైల్వేపట్టాలను చెక్ చేస్తున్నందున సోమ, మంగళవారాల్లో చిలకలపూడి రైల్వేగేటును మూసివేశారు. ట్రాఫిక్‌ను నవీన్‌మిట్టల్ కాలనీ వద్ద ఉన్న రైల్వే గేటు మీదుగా మళ్లించారు.



మంత్రి రవీంద్ర, ఎంపీ బాలశౌరి చిత్రపటాలకు పాలాభిషేకం

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : పట్టాభి స్మారక భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసినందుకు కృతజ్ఞత తెలుపుతూ, సోమవారం ఎంపీ వల్లభనేని బాలశౌరి, కొల్లు రవీంద్ర చిత్రపటాలకు పట్టాభి స్మారక భవన నిర్మాణ సాధన కమిటీ సభ్యులు పాలాభిషేకం చేశారు. కమిటీ సభ్యులు పి.వి. ఫణికుమార్, వి.ఎస్.ఎ్ ఎ.ఆర్. శర్మ, మోపర్తి సుబ్రహ్మణ్యం, ధూళిపాళ శ్రీరామచంద్రమూర్తి, టీడీపీ నగర అధ్యక్షుడు లోగిశెట్టి వెంకటస్వామి, జనసేన నగర అధ్యక్షుడు గడ్డం రాజు, బీజేపీ నాయకుడు సూరిశెట్టి హరికృష్ణతో పాటు మార్కెట్ యార్డు డైరెక్టర్ చోడవరపు లక్ష్మీప్రసూన, బ్రాహ్మణ మహిళా నాయకురాలు అంబటిపూడి నాగలక్ష్మి, నాయకులు అడపా రత్నాకర్, రాజారామ్, కొల్లు సాయిమోహన్ తదితరులు పాల్గొన్నారు.



అక్రమతూములు తొలగించాలని దింటిమెరక రైతుల ఆందోళన

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : రత్నకోడు డ్రెయిన్‌పై అక్రమ తూములు వేయడం వల్ల నాలుగేళ్లుగా వరి పంట పండించుకోలేకపోతున్నామని కోడూరు మండలం దింటిమెరక, పాలకాయతిప్ప రైతులు తెలిపారు. దింటిమెరక నుంచి పాలకాయతిప్ప వరకు గల మాగాణి పొలాలకు ఈస్ట్‌చానల్ ద్వారా సాగునీరు అందుతుందని, అయితే ఇరాలి గ్రామం వద్ద రత్నకోడు డ్రెయిన్ నుంచి న్యూ ఇరాలి డ్రెయిన్ వరకు నాలుగు చోట్ల అక్రమంగా తూములు వేయడం వల్ల మురుగునీరంతా పంట పొలాల్లోకి వచ్చి, నాట్లు వేయలేకపోతున్నారని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘ నాయకుడు జొన్నలగడ్డ రాజగోపాలరావు తెలిపారు. తమ గోడును అధికారులకు వినిపించుకుంటున్నా పట్టించుకోవడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని అక్రమ తూముల తొలగింపునకు చర్యలు తీసుకోవాలని కోరారు.

రైతులకు యూరియా అందేలా చర్యలు తీసుకోవాలి

పెడన రూరల్, అగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : యూరియా రైతులకు సక్రమంగా అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ రాజులపాటి వాణి అన్నారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం జరిగింది. మండల వ్యవసాయాధికారిణి సజ్జా జెన్ని మాట్లాడుతూ మండలంలో 23 వేల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారని, ఇప్ప టి వరకు 50 శాతం నాట్లు పూర్తయ్యాయన్నారు. రైతులకవసరమైన యూరియా సంఘాల ద్వారా అందించామన్నారు. మళ్లీ ఇండెంట్ పెట్టి అందరికీ అందిస్తామన్నారు. కుక్కలు కోతుల బెడద గ్రామాలలో ఎక్కువగా ఉందని సర్పంచి దావు భైరవలింగం తెలియజేయగా, చర్యలు తీసుకుంటామని పశువైద్యాధికారి మీర్ అల్తాఫ్ హుస్సేన్ తెలిపారు. నందమూరుకు తాగునీరు అందటం లేదని, ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని ఎంపీటీసీ సభ్యుడు బొల్లా ఉదయ్ నాగ కుమార్ కోరారు. ఎంపీడీవో శివప్రసాద్, వైస్ ఎంపీపీ యాదంరెడ్డి వరప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు అంకెం నరసింహారావు, గంధం విజయలక్ష్మి, బొడ్డు గురునాథం, రాజులపాటి అచ్యుతరావు, ఈవోఆర్డీ నాగిరెడ్డి, ఏఈ ధర్మయ్య, వెలుగు ఏపీఎం శ్రీదేవి, విజయకుమారి పాల్గొన్నారు.

మానవత్వంతో పింఛన్లు ఇప్పించండి

జొన్నలవారిమోడి దివ్యాంగుల మొర



మచిలీపట్నం టౌన్, అగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : మానవత్వంతో పింఛను ఇప్పించాలంటూ తాళ్లపాలెం శివారు జొన్నలవారిమోడి గ్రామంలోని దివ్యాంగులు మీడియాకు తమ గోడు వినిపించుకున్నారు. సచివాలయాలు, వైద్యుల చుట్టూ తిరుగుతున్నామన్నారు. వికలాంగ శాతం ధృవీకరించి పింఛన్లు మంజూరు చేయాలని కోరారు. అందులు అడ్డాల వీరనాగబాబు, ఈమన నాగప్రసాద్, సిద్ధిరెడ్డి నరేష్‌కుమార్ పింఛను ఇప్పించాలని తాళ్లపాలెం సచివాలయానికి కూడా వెళ్లి తమ గోడు వినిపించుకున్నారు.

మేలైన యాజమాన్య పద్ధతులపై శిక్షణ

ఘంటసాల, అగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : వరి పంట సాగులో మేలైన యాజమాన్య పద్ధతులపై కృషి విజ్ఞాన కేంద్రంలో సోమవారం శిక్షణ నిర్వహించారు. సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి మాట్లాడుతూ అధిక మోతాదులో రసాయన ఎరువులు వినియోగిస్తున్నారని తద్వారా సాగు ఖర్చు అధికంగా మారి నికర ఆదాయం తగ్గుతుందన్నారు. రసాయనేతర పద్ధతులు అవలంబించాలన్నారు. జిల్లా వనరుల కేంద్రం డీడీఏ జ్యోతి మాట్లాడుతూ భూసార ఆధారిత ఎరువుల యాజమాన్యం తప్పనిసరిగా పాటించాలని సూచించారు. కలుపు యాజమాన్యంపై శాస్త్రవేత్త వెంకటలక్ష్మి, చీడపీడల యాజమాన్యంపై శాస్త్రవేత్త రేవతి అవగాహన కల్పించారు. ఏడీఏలు శ్రీనివాసరావు, శ్యామల, ఏవో పద్మజ, మండల వ్యవసాయాధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలపై పోరాటానికి ఒంగోలు మహాసభలో భవిష్యత్తు కార్యాచరణ



పెడనలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కె.వి.వి.ప్రసాద్

పెడన, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులో ఈనెల 23, 24, 25 తేదీల్లో జరిగే సీపీఐ రాష్ట్ర మహాసభల్లో ప్రజా సమస్యల పరిష్కారానికి భవిష్యత్తు కార్యాచరణను రూపొందిస్తామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కె.వి.వి.ప్రసాద్ తెలిపారు. సర్వోదయ చేనేత సొసైటీలో జరిగిన సమావేశంలో సోమవారం ఆయన మాట్లాడారు. టీడీపీ, వైసీపీలు కార్పొరేట్లకు, ప్రైవేటీకరణకు అనుకూలంగా వ్యవహరిస్తుండటంతో ప్రజలపై భారాలు పడుతున్నాయని ఆరోపించారు. ఈ రెండు పార్టీలకు ప్రత్యామ్నాయ వ్యవస్థను ఏర్పాటు చేసే విషయమై సభల్లో చర్చ జరుగుతుందన్నారు. సీపీఐ అనుబంధ సంస్థ ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కట్టా హేమసుందరరావు మాట్లాడుతూ, నేతన్నలకు ప్రకటించిన సంక్షేమ పథకాలు త్వరితగతిన సక్రమంగా అమలయ్యేలా సీఎం చంద్రబాబు చర్యలు తీసుకోవాలన్నా రు. చేనేత కార్మికులకు ఏడాదికి రూ.25 వేల ఆర్థిక సాయం పరిశ్రమలోని అన్ని విభాగాల కార్మికులకు వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి నార్ల వెంకటేశ్వరరావు, సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్, మోదుమూడి రామారావు, పేరిశెట్టి ఉమాకాంతం పాల్గొన్నారు.



పులిగడ్డ అక్విడెక్ట్ వద్ద ఉధృతంగా వరద



జయపురం సమీపంలో ముంపులో పంట పొలాలు



పసుపు పంటను పరిశీలిస్తున్న కీర్తి

దిగువకు వరద - ముంపులోనే పొలాలు

అవనిగడ్డ రూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రకాశం బ్యారేజీ నుంచి దిగువకు వరద వస్తుండడంతో ప్రస్తుతం పులిగడ్డ ఆక్విడెక్ట్ వద్ద 17 అడుగుల మేర వరద ప్రవాహం కొనసాగుతోంది. నదీ పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలిన ఇరిగేషన్ అధికారులు సూచించారు. కృష్ణానది గర్భంలోని పాత ఎడ్లంక గ్రామాన్ని వరద నీరు చుట్టుముట్టి దాదాపు ఐదు రోజులు అయ్యింది. నేటికీ పాత ఎడ్లంక వాసులు బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు. ముఖ్యంగా పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, కూలీ పనులు చేసుకునే వారు గత్యంతరం లేక పడవలోనే ప్రయాణిస్తున్నారు. **నాగాయలంక :** సోమవారం నాగాయలంక రేవుకు భారీగా వరద నీరు చేరింది. శ్రీరామపాదక్ష క్షేత్రం పుష్కరఘాట్‌లోని కృష్ణమ్మ విగ్రహం వద్ద వరద నీరుపరవళ్లు తొక్కుతోంది. మత్స్యకారులు తమ పడవలను ఒడ్డుకు చేర్చి లంగర్లు వేశారు. తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ సిహెచ్.వీరాంజనేయ ప్రసాద్ సూచించారు. భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని, మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లవద్దని సూచించారు. భారీ వర్షాలు రానున్నందున ముందస్తు చర్యగా టాంటాం ద్వారా తెలియజేయాలని వీఆర్వోలను ఆదేశించినట్లు తహసీల్దార్ తెలిపారు.

వీడని ముంపు

కోడూరు : వరి పొలాలు ముంపు బారి నుంచి బయట పడలేదు. వాయుగుండం ప్రభావంతో సముద్రం ఎగదన్నటంతో డ్రెయిన్లలో మురుగు నీరు దిగువకు పారే పరిస్థితి లేదు. వరి పొలాలు మునకలోనే ఉండి వరి దుబ్బులు కుళ్లిపోతున్నాయని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. వలకట్టు పాట లక్షల్లో ఉంటుందని, అందుకే వలకట్లు పాటదారులు రాత్రి సమయంలో వేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. మండలంలోని లింగారెడ్డిపాలెం, వి.కొత్తపాలెం, మాచవరం, చినగూడుమోటు, దింటిమెరక, కోడూరు గ్రామాల్లో వరి పొలాలు ఇంకా నీటిలోనే ఉండటంతో రైతన్నల ఆశలు నీరు కారిపోతున్నాయి. రత్నకోడు డ్రెయిన ప్రక్షాళన పనుల్లో, వలకట్ల తొలగింపు పనుల్లో నిర్లక్ష్యం కారణంగానే తమకు ఈ పరిస్థితి ఎదురైందని రైతులు వాపోతున్నారు. ముంపుకు గల ప్రధాన కారణాలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

హంసలదీవి బీచ్ గేట్లు మూసివేత

కోడూరు : వాతావరణ శాఖ హెచ్చరికను అనుసరించి పాలకాయితిప్ప వద్ద ఉన్న హంసలదీవి బీచ్ గేట్లు మూసివేసినట్లు సోమవారం అటవీ శాఖ సెక్షన్ ఆఫీసర్ నాగమణి తెలిపారు. రానున్న 48 గంటల్లో కృష్ణా జిల్లాలో వర్షాలు ఉన్న కారణం చేత సముద్రం దగ్గర అటవీ శాఖ ఆవరణలో ఉన్న హంసలదీవి గేట్లను మూ డు రోజులపాటు మూసి వేస్తున్నామన్నారు. పర్యాటకులు ఈ విషయాన్ని గమనించి రావద్దని తెలిపారు.

ముంపు పొలాల పరిశీలన

చల్లపల్లి : అధిక వర్షాలు, వరదల కారణంగా చల్లపల్లి మండలం నడకుదురులో నీటిముంపుకు గురైన వాణిజ్య పంటలను ఉద్యానవన శాఖ అధికారి కీర్తి సోమవారం పరిశీలించారు. పసుపు, కంద, అరటి తోటలు 25 ఎకరాలకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనా వేసినట్లు తెలిపారు. మొక్కట్ట రైతులకు పలు సూచనలు, సలహాలు అందచేశారు.

కోదండ రామస్వామి ఆలయానికి శంకుస్థాపన



మచిలీపట్నం టౌన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : కానూరులో కోదండ రామస్వామి ఆలయ నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు. జిల్లా తెలుగు రైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ, వెంకటేశ్వరమ్మ దంపతులు వేదోక్తంగా పూజలు జరిపారు. గ్రామస్థులు పాల్గొన్నారు.



సుభాష్‌చంద్రబోస్‌కు మత్స్యకార నేతల నివాళి

నాగాయలంక, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల సేవా సమితి ఆధ్వర్యంలో ఉన్న సుభాష్ చంద్రబోస్ 80వ వర్ధంతి నిర్వహించారు. జరిగింది. బోస్ విగ్రహానికి నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇండియన్ నేషనల్ ఆర్మీ స్థాపించి బ్రిటీష్ సైన్యంతో అవిశ్రాంతంగా పోరాడారని లకనం నాగాంజనేయులు, కర్రి కృష్ణమూర్తి, షేక్ జానీ, సైకం విజయభాస్కరరావు, తానంకి చంటి అన్నారు.



నాగాయితిప్ప పీఏసీఎస్ త్రిసభ్య కమిటీని సత్కరిస్తున్న కూటమి నాయకులు



నాగాయలంక పీఏసీఎస్ సభ్యులను అభినందిస్తున్న నాయకులు



లక్ష్మీపురం సొసైటీ చైర్మన్‌గా బాధ్యతలు చేపడుతున్న లంకబాబు

రైతులకు మెరుగైన సేవలందించండి



మేకావారిపాలెం సొసైటీ చైర్మన్ గుత్తికొండ వంశీకృష్ణ, పర్సన్‌లను అభినందించిన కనపర్తి, వెంకట్రామ్

మోపిదేవి, అగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : రైతులకు నిరంతరం అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలందించాలని నియోజకవర్గ టీడీపీ పరిశీలకు కనపర్తి శ్రీనివాసరావు, యువ నేత మండలి వెంకట్రామ్ కోరారు. నా గాయితిప్ప పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ బాధ్యతల స్వీకరణ సోమారం జరిగింది. సభ్యులు రైతులకు ఎరువులు, విత్తనాలు, ఇతర సౌకర్యాలు కల్పిస్తూ మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. పీఏసీఎస్ చైర్మన్ బల్లా సీతారామ ప్రసాద్, కమిటీ సభ్యులు రేపల్లె మునేశ్వరరావు, గరికపాటి రాఘవయ్య బాధ్యతలు స్వీకరించగా, ఘనం గా సత్కరించారు. నడకుదుటి జనార్ధనరావు, పూషడపు రత్నగోపాల్, బాధ్యతలు స్వీకరించారు. నాగేశ్వరరావును ఏఎంసీ చైర్‌పర్సన్ తోట కనకదుర్గ, ఎంపీటీసీ సభ్యు లు తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా), సిద్ధినేని కు మార్ రాజా, పరుచూరి సుభాష్ చంద్రబోస్, నీటి సంఘాల అధ్యక్షులు పరిశె చలపతి, ఆవుల ధర్మవెంకట నరసయ్య, బీజేపీ నేత నందూరి రాజేంద్ర ప్రసాద్ ఘనంగా సత్కరించారు.

నాగాయలంకలో...

నాగాయలంక : నాగాయలంక పీఏసీఎస్‌కి చైర్మన్‌గా ముమ్మారెడ్డి శ్రీనివాసరావు, సభ్యులుగా తాడేపల్లి వెంకట పాపారావు, బండ్రెడ్డి బాలకృష్ణతో మేనేజర్ చింతలపూడి మధుబాబు సోమవారం ప్రమాణ స్వీకారం చేయించారు. టీడీపీ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు, ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, మండలి వెంకట్రామ్, సర్పంచ్‌లు కైతేపల్లి అంకాలు, మండలి ఉదయభాస్కర్, డీసీ చైర్మన్ బండ్రెడ్డి నాగమల్లిఖార్జునరావు, మాజీ చైర్మన్ మండవ బాలవర్ధిరావు, టీడీపీ మం డల అధ్యక్షులు మెండు లక్ష్మణరావు, తలశిల స్వర్ణలత, గుడివాక శివాజీ, ఫీల్డ్ ఆఫీసర్ కన్నా రాంబాబు, కార్యదర్శి కెవి.రామాంజనేయులుతోపాటు కూటమి నేతలు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి మంచిపేరు తేవాలి

చల్లపల్లి : కూటమి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకువచ్చేలా రైతుల సంక్షేమానికి పాటుపడుతూ సొసైటీల్లో ఆదర్శవంతమైన పాలన చేయాలని టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు, యువనేత మండలి వెంకట్రామ్‌లు అన్నారు. మేకావారిపాలెం సొసైటీ చైర్‌పర్సన్‌గా గుత్తికొండ వంశీకృష్ణ, పర్సన్‌లుగా వక్కలగడ్డ శివరామకృష్ణ, చిటికినేని శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. వంశీకృష్ణను, పర్సన్‌లను ఘనంగా సన్మానించారు. జడ్పీటీసీ సభ్యురాలు రాజులపాటి కళ్యాణి, సర్పంచ్‌లు తోట శ్రీనివాసరావు, పైడిపాముల కృష్ణకుమారి, ఏఎంసీ చైర్మన్లు కొల్లూరి వెంకటేశ్వరరావు, తోట కనకదుర్గ, వైస్‌ఎంపీపీ మోర్ల రాంబాబు, డీసీ చైర్మన్ నిడమానూరి దిలీప్‌కుమార్, ఉపసర్పంచ్ ముమ్మనేని నాని, ఎంపీటీసీ పెడిపాముల స్వప్న, చల్లపల్లి సొసైటీ చైర్‌పర్సన్ బొందలపాటి వీరబాబు, పార్టీనేతలు యార్లగడ్డ శ్రీనివాసరావు, బోలెం నాగమణి, మోర్ల శివ, పరిశె మౌళి, షేక్ నబీఘోర, బండే రాఘవ, మేకా వెంకటేశ్వరరావు, బోలెం రామారావు, బుల్లా కిషోర్, సీఈవో కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు. లక్ష్మీపురం సొసైటీ చైర్మన్‌గా యార్లగడ్డ సోమశేఖర ప్రసాద్ (లంకబాబు), పర్సన్‌లుగా తోట రాజేశ్వరరావు, సూదాని పూర్ణచంద్రరావు బాధ్యతలు స్వీకరించారు. యువనేత మండలి వెంకట్రామ్, కనపర్తి శ్రీనివాసరావు, ప్రజాప్రతినిధులు, కూటమి నేతలు లంకబాబు, పర్సన్‌లను సన్మానించారు. సీఈవో రమేష్‌బాబు, చక్రపాణి, కృష్ణారావు పాల్గొన్నారు.

ముక్కొల్లు పీఏసీఎస్ చైర్మన్‌గా రాఘవప్రసాద్



గూడూరు : రైతులకు మెరుగైన సేవలందించి పీఏసీఎస్‌కు మంచి పేరు తీసుకురావాలని డీసీ చైర్మన్ పోతన స్వామి అన్నారు. ముక్కొల్లు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్‌గా సమ్మెట రాఘవప్రసాద్ (నాని), పర్సన్లుగా శాఖల మహంకాళరావు, ముక్కు సుబ్రహ్మణ్యేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేశారు. రాఘవప్రసాద్ మాట్లాడుతూ, ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ సహకారంతో రైతులకు సేవలం దిస్తానన్నారు. తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ కార్యదర్శి నాగబాబు, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి ఎస్‌ఏ బేగ్, గూడూరు జనసేన పార్టీ నాయకులు పోతన రామోజీ, మండల బీజేపీ అధ్యక్షుడు కోలపల్లి రజని, కూటమి నాయకులు పాల్గొని పాలకవర్గ సభ్యులను అభినందించారు.

సనకా ప్రశాంత్, కొల్లూరి వెంకటేశ్వరరావు, రావి దు ర్గావాణి, మెడబలిమి మ ల్లిఖార్జునరావు, దిడ్ల రాణి, సనకా వెంకట రాజేష్, బొబ్బా గోవర్ధన్, రావి నాగేశ్వరరావు, రావి రత్నగిరి, దిడ్ల జానకి రాంబాబు, చందన రంగారావు, పుప్పాల ఏసు, మోర్ల జయలక్ష్మి, డొకిపర్తి బాలకోటేశ్వరరావు, నాగమల్లేశ్వరరావు, పీఏసీఎస్ కార్యదర్శి భోగాది లంకేశ్వరరావు, నాదెళ్ల శరత్ చంద్రబాబు, కోసూరు నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

లంకపల్లి పీఏసీఎస్ చైర్మన్‌గా నాగేశ్వరరావు

ఘంటసాల : లంకపల్లి పీఏసీఎస్ చైర్మన్‌గా యెనుముల నాగేశ్వరరావు, సభ్యులుగా నండూరి సువర్ణ, పరిశె మనీషా సోమవారం

రైతులకు మెరుగైన సేవలందిస్తా : వరప్రసాద్



కొడాలి పీఏసీఎస్ త్రిసభ్య కమిటీని సత్కరిస్తున్న నేతలు

ఘంటసాల : రైతులకు మెరుగైన సేవలందించటంతోపాటు సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తానని కొడాలి పీఏసీఎస్ చైర్ పర్సన్ గుత్తికొండ వరప్రసాద్ పేర్కొన్నారు. వరప్రసాద్‌తో పాటు సభ్యులుగా కంఠమనేని రాజగోపాల్, వేముపల్లి ప్రకాశరావు బాధ్యతలు స్వీకరించారు. అనంతరం చైర్మన్ వరప్రసాద్, సభ్యులను ఘనంగా సత్కరించారు. టీడీపీ మండల అధ్యక్షుడు తుమ్మల చౌదరిబాబు అధ్యక్షతన ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు మండలి వెంకట్రామ్, ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, తుమ్మల జనార్ధనబాబు, బొబ్బా గోవర్ధన్, టీడీపీ నేతలు పరుచూరి సుభాష్ చంద్రబోస్, అయినపూడి భానుప్రకాష్, వేమూరి సాయి వెంకటరమణ, వీరమాచినేని భవాని ప్రసాద్, రావి నాగేశ్వరరావు, పరిశె చలపతి, పీఏసీఎస్‌ల అధ్యక్షులు బండి పరాత్పరరావు, గొర్రెపాటి సురేష్, మాజీ జడ్పీటీసీ సభ్యురాలు తుమ్మల వరలక్ష్మి, కార్యదర్శి తుమ్మల ఆదినారాయణ పాల్గొన్నారు.

ఆటో తిరగబడి మహిళ మృతి..కూలీలకు గాయాలు

బంటుమిల్లి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : అర్తమూరు శివారు సాయినగర్ ఆటో తిరగబడి మహిళ మృతి చెందగా, పలువురు కూలీలు గాయపడ్డారు. మల్లంపూడి గ్రామానికి చెందిన ఆటోలో పొలం పనులకు వెళ్లి, సాయంత్ర స్వగ్రామం మల్లంపూడికి తిరిగి వస్తుండగా, సా యినగర్ వద్ద రోడ్డు పైకి మరో ఆటో రావడంతో కూలీల ఆటో డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో ఆటో తిరగబడింది. గాయపడిన కూలీలను వెంటనే బందరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కొల్లాటి నాగమణి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్య సదుపాయం కోసం విజయవాడ తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందింది. ఆమెకు భర్త, ముగ్గురు పిల్లలు ఉన్నారు. నాగమణి మృతితో మల్లంపూడిలో విషాద ఛాయలు అలముకున్నాయి. కేసు నమోదు కావల్సి ఉంది.

రైతులు గ్రామసభకు రావాలి

కోడూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): పిట్టలంక గ్రామంలో మంగళవారం జరిగే గ్రామసభకు రైతులు హాజరుకావాలని తహసీల్దార్ సౌజన్య కిరణ్మయి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పిట్టలంక గ్రామంలో వ్యవసాయ భూముల రీ సర్వే రికార్డు జేసీ ఆమోదించారన్నారు. పిట్టలంక గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఉదయం 11 గంటలకు జరిగే గ్రామసభకు భూ యజమానులు తప్పకుండా హాజరై, తమ తమ భూముల వివరాలను పరిశీలించుకోవాలని కోరారు.

బీజేపీ ఆధ్వర్యంలో సంచార జాతుల విముక్తి దినోత్సవం

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ ఆధ్వర్యంలో ఈనెల 30న విజయవాడలో నిర్వహించనున్న సంచార, అర్ధసంచార విముక్త జాతుల విముక్తి దినోత్సవాన్ని విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు తాతినేని శ్రీరామ్ పిలుపునిచ్చారు. బుట్టాయిపేటలోని బీజేపీ కార్యాలయంలో సోమవారం కార్యక్రమం వాల్‌పోస్టర్లను తాతినేని శ్రీరామ్ ఆవిష్కరించి మాట్లాడారు. బ్రిటీషు కాలం నాటి చట్టాల వల్ల, గత కాంగ్రెస్ పాలకుల నిర్లక్ష్యం వల్ల సంచార జాతుల ప్రజలు ప్రభుత్వ ఆదరణకు దూరంగా ఉండిపోయారన్నారు. జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు పంతం వెంకట గజేంద్రరావు, పోలా అశోక్, సిహెచ్. పద్మరాజు, వీర్ల కృష్ణ, బొడ్డు సునీల్,గంటా సతీష్ పాల్గొన్నారు.

మండలి వెంకట కృష్ణారావుకు ఘననివాళి

నాగాయలంక : మండలి వెంకట కృష్ణారావు శతజయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి 15వ రోజు సోమవారం నూతన పీఏసీఎస్ అధ్యక్షుడు ముమ్మారెడ్డి శ్రీనివాసరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత, టీడీపీ మండల అధ్యక్షులు మెండు లక్ష్మణరావు, మండలి ఉదయభాస్కర్, బండ్రెడ్డి మల్లిఖార్జున్, ఉప్పల ప్రసాద్, మాదివాడ అర్జునరావు, గుడివాక శివాజీ, తాడేపల్లి వెంకట పాపారావు, షేక్ జాని, తలశిల శివరామకృష్ణ, అవనిగడ్డ వెంకటేశ్వరరావు, తలశిల శివరామకృష్ణ పాల్గొన్నారు.